


దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

# నీలగిరి శంఖారావమ్

సమగ్ర సమాచార దర్శిని    తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ    సంపుటి :05    సంచిక :133  ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్    గురువారం 10-09-2026    పేజీలు : 4    వెల : రూ. 3/-

## దళితులు నిరసన తెలిపిన ప్రాంతంలో పసుపు నీళ్లు చల్లడంపై ఆగ్రహం

హైదరాబాద్,తెలంగాణలో దళితుల పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆయన బృందం వివక్షాపూరిత వైఖరిని ప్రదర్శిస్తున్నారని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆరోపించారు. మనువాద భావజాలాన్ని కేసీఆర్, ఆయన అనుచరులు ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న సమావేశ వేదికను శుద్ధి చేశారన్న ఘటనను, తెలంగాణలో దళితులు శాంతియుతంగా నిరసన తెలిపిన ప్రాంతంలో పసుపు నీళ్లు చల్లి శుద్ధి చేశారన్న ఆరోపణలను వీరేశం ప్రస్తావించారు. రెండు ఘటనల వెనుక ఉన్న భావజాలం ఒక్కటేనని ఆయన వ్యాఖ్యానించారు. మాల, మాదిగ సోదరులు శాంతియుతంగా తమ నిరసనను వ్యక్తం చేసిన ప్రాంతాన్ని పసుపు నీటితో శుద్ధి చేయడం దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే చర్యగా ఆయన అభివర్ణించారు. ప్రజాస్వామ్యంలో ఎవరు ఏ కులానికి చెందిన వారైనా సమాన గౌరవం పొందాల్సిందేనని, కులం ఆధారంగా ఎవరినీ అవమానించే పరిస్థితులకు చోటు ఉండకూడదని అన్నారు. దళితుల ఆత్మగౌరవం కోసం పోరాడిన చరిత్ర తమదేనని వీరేశం పేర్కొన్నారు. గతంలో దొరల గడీల్లో దళిత సమాజం ఎదుర్కొన్న వివక్షకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు జరిగాయని గుర్తుచేశారు. ఆ పోరాటాల ఫలితంగా సామాజిక సమానత్వం, గౌరవం కోసం ఉద్యమాలు బలపడ్డాయని అన్నారు. గతంలో తమకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన దళిత సమాజంపై కక్షతోనే కేసీఆర్ ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని వీరేశం



ఆరోపించారు. డబ్బు, సంపద, మీడియా సంస్థలు ఉన్నాయనే అహంకారంతో దళిత జాతులను అవమానించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. 'మా ప్రజలు నడిచిన నేల మైలపడిందా?' అని ప్రశ్నించిన వీరేశం.. ఒక వర్గం ప్రజలు నడిచిన ప్రాంతాన్ని శుద్ధి చేయాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. ఇలాంటి చర్యలు సామాజిక సమానత్వానికి విరుద్ధమని అన్నారు. దళితుల పట్ల వివక్ష, అవమానకరమైన ధోరణులను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని వీరేశం పేర్కొన్నారు. సమాజంలో కుల వివక్షకు తావులేని విధంగా అన్ని వర్గాల ఆత్మగౌరవాన్ని కాపాడే వాతావరణం ఉండాలని ఆయన అన్నారు.

## శాసనసభ్యులపై పోలీసుల దాడుల దైన్యం.. గవర్నర్‌కు ఆధారాలు సమర్పించిన కేటీఆర్



హైదరాబాద్, తెలంగాణ రాజకీయాల్లో శాసనసభ వేదికగా మొదలైన రగడ రాజ్‌భవన్‌కు చేరింది. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి పూర్తిగా దిగజారిపోయిందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలిశారు. ఈ భేటీ అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నడిరోడ్డుపై ప్రజాప్రతినిధులని కూడా చూడకుండా పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత హేయమన్నారు. ముఖ్యంగా మహిళా ఎమ్మెల్యేలైన సబితా ఇంద్రారెడ్డిని జుట్టు పట్టు లాగడం, సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి దుశ్శాసన పర్వానికి తెరలేపడం వంటి అమానుష ఘటనలకు సంబంధించిన పూర్తి ఫోటోలు, వీడియో ఆధారాలను గవర్నర్‌కు అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని, ప్రతిపక్ష గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని గవర్నర్‌కు వివరించినట్లు తెలిపారు. ఈ అరాచకాలపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ప్రతినిధి బృందం గవర్నర్‌ను కోరింది.

## శాసనసభలో 'ఏలేటి' కాక.. మంత్రుల ఎదురుదాడి

హైదరాబాద్, తెలంగాణ శాసనసభ వేదికగా అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల తూటాలు పేలాయి. సభా సంప్రదాయాలు, సభ్యుల సస్పెన్షన్ల అంశంపై బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేసిన ఘాటు వ్యాఖ్యలు సభలో తీవ్ర దుమారానికి దారితీశాయి.

సభలో లేని సభ్యులను సైతం ఇష్టానుసారంగా సస్పెండ్ చేయడం దారుణమంటూ ఆయన సంధించిన విమర్శనాస్త్రాలు సభను అట్టుడుకించాయి. రైతు సమస్యలపై చర్చిస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు బీఏసీ నిర్ణయాలకు తూట్లు పొడుస్తున్నారా అని ఏలేటి నిలదీయడంతో అధికారపక్షం ఒక్కసారిగా భగ్గుమంది. సభా మర్యాదలు పాటించాలి: భట్టి విక్రమార్క : ఏలేటి వ్యాఖ్యలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. సభా ఔన్నత్యాన్ని, స్పీకర్ స్థాన గౌరవాన్ని కాపాడాల్సిన కనీస బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందని ఆయన హితవు పలికారు. చర్చకు మేం సిద్ధం.. మీకే ఇష్టం లేదు: మంత్రి శ్రీధర్‌బాబు : శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. సభ సజావుగా సాగడం బీజేపీ సభ్యులకు ఏమాత్రం ఇష్టం లేనట్లుగా ఉందని మండిపడ్డారు. ఎన్ని రోజులైనా సభ నడిపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. బలహీనవర్గాల హక్కులు, విద్యా సంస్కరణలు, 22ఏ సమస్యలపై లోతైన చర్చకు సిద్ధమని, నిరంతరం అడ్డుకోవడమే విపక్షాల నైజంగా మారిందని ధ్వజమెత్తారు. మంత్రుల ముప్పేట



దాడి : దళితులను అవమానించిన వారిని సమర్థించడం భావ్యం కాదని మంత్రి పొన్నం ప్రభాకర్ చురకలంటించారు. తెలంగాణ ప్రయోజనాల కోసం కొట్లాడితే హర్షించేవారమని పేర్కొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఎర్రవల్లిలో దళితులు పాల్గొన్న వేదికను, మల్లికార్జున ఖర్గే కూర్చున్న ప్రాంగణాన్ని శుద్ధి చేయడాన్ని ఎండగట్టారు. స్పీకర్ స్థానాన్ని కించపరిచేలా వ్యవహరిస్తే సభ్యసమాజం సహించబోదని బీజేపీ సభ్యులను హెచ్చరించారు. మొత్తంగా ఏలేటి వ్యాఖ్యలు సభలో అధికార-ప్రతిపక్షాల మధ్య సరికొత్త రాజకీయ రగడకు ఆజ్యం పోశాయి.

## ఇండ్ల స్థలాల కోసం దీక్ష చేస్తున్నా పట్టించుకోరా?




హైదరాబాద్,పేదలకు ఇండ్ల స్థలాల కోసం ఇచ్చిన పట్టాలు చేతిలో ఉన్నా.. 19 ఏళ్లుగా స్థలాలు కేటాయించకపోవడంపై బీఆర్ఎస్ నాయకురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 151లో 2007లో 290 మంది పేదలకు ఇండ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేసినప్పటికీ, ఇప్పటివరకు వారికి స్థలాలు కేటాయించలేదని ఆమె 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. సొంతింటి స్థలం కోసం 19 ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదల పరిస్థితిపై కవిత ఆందోళన వ్యక్తం చేశారు. పట్టాలు అందుకున్నప్పటి నుంచి ఎప్పుడు స్థలం వస్తుందా.. ఎప్పుడు సొంతింటి కల నెరవేరుతుందా అనే ఆశతో లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ఇన్నేళ్లు గడిచినా సమస్య పరిష్కారం కాకపోవడం బాధాకరమని అన్నారు. పేదలకు కేటాయించాల్సిన స్థలంలో మార్కెట్ యార్డు నిర్మించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కవిత ఆరోపించారు. ఇప్పటికే పట్టాలు పొందిన 290 మంది లబ్ధిదారులకు న్యాయం చేయకుండా అదే భూమిని ఇతర అవసరాలకు వినియోగించాలనుకోవడం సరికాదని పేర్కొన్నారు. 2007లో పట్టాలు పంపిణీ చేసి, దాదాపు రెండు దశాబ్దాలు గడిచినా స్థలాలు కేటాయించకపోవడం గత, ప్రస్తుత ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమని కవిత విమర్శించారు. పేదల సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వాలు వారి సుదీర్ఘ నిరీక్షణను పట్టించుకోకపోవడం తగదన్నారు. ఇండ్ల స్థలాల కోసం పేదలు 75 రోజులుగా దీక్ష చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంపై ఆమె ప్రశ్నించారు. దీక్ష చేస్తున్న వారి సమస్యను వెంటనే గుర్తించి, సర్వే నంబర్ 151లో పట్టాలు పొందిన 290 మంది పేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. పేదల సొంతింటి కలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

## చట్టసభల్లో బూతుల సంస్కృతిపై కూనంనేని తీవ్ర ఆగ్రహం



హైదరాబాద్,శాసనసభల హుందాతనం మంటగలుస్తోందని,ప్రజాస్వామ్య దేవాలయం కాస్తా అగౌరవ సభగా,చట్టసభలు చట్టవిరుద్ధ సభలుగా మారుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి,ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.స్పీకర్  ఏనాడు కూడా ఆ పదవి దర్పం ప్రదర్శించలేదని,ధర్మరాజులోని ధర్మం,భూమాత సహనం కలగలిపిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు.అయితే సభలో కొందరు ప్రతినిధులు మాట్లాడుతున్న తీరు,అభ్యంతరకర పదజాలం,వ్యక్తిగత దూషణలు శృతిమించుతున్నాయని ఆయన మండిపడ్డారు.తెలంగాణ ఉద్యమ ప్రారంభం నుంచి బాగా తిడితే,పంచ్ డైలాగులు మాట్లాడితే ప్రజలు ఆకర్షితులవుతారనే భ్రమతో మన తెలుగు,తెలంగాణ సంస్కృతిని,సహానుభూతిని మొత్తం విధ్వంసం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.అమ్మలను,అక్కచెల్లెళ్లను తిట్టే హక్కు ఎవరిచ్చారని నిలదీస్తూ,ఇళ్లల్లో ఉండే మహిళలకు రాజకీయాలు తెలియవని,కుస్తీలు పడాలంటే బయట చూసుకోవాలని  ఉంటాయని హితవు పలికారు.హరీష్ రావు లాంటి అనుభవజ్ఞులు కూడా సభలో చొక్కాలు ఇప్పేయడం అత్యంత అభ్యంతరకరమని,ఫైటింగ్‌లు చేసుకోవడానికి ఇది వేదిక కాదని స్పష్టం చేశారు.పొట్టివాడు,పోరుగాడు,లావుపాటివాడు,మరుగుజ్జు అంటూ వ్యక్తిగత రూపాలను విమర్శించడం మానుకుని,పేద ప్రజల ఆకలి బాధలు,కష్టజీవులు, తక్కువ జీతాలతో పనిచేసేవారి సమస్యలపై మాట్లాడాలని హితవు పలికారు.చట్టాలు చేసే లా మేకర్స్ కాస్తా నిబంధనలను ఉల్లంఘించే లా బ్రేకర్స్ అయిపోతున్నారని విమర్శించారు.తాత మధు ఆవేశంలో నోరుజారితే స్పీకర్ గారి దగ్గరకు వెళ్లి క్షమాపణ కోరాల్సింది పోయి,రివర్స్‌లో ఘర్షణ పెట్టుకోవడం బాగాలేదని కూనంనేని పేర్కొన్నారు.శ్రీధర్ బాబు తండ్రి శ్రీపాద రావును నక్సలైట్లు హత్య చేసినప్పటికీ,ఆయన ఏనాడు కోపం తెచ్చుకోలేదని,రాహుల్ గాంధీ, సోనియా గాంధీ కూడా రాజీవ్ గాంధీని చంపినవాళ్లను క్షమించాలని కోరిన సంస్కారాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు.పత్రికలు కూడా బూతులు తిట్టేవాళ్లను బాక్సులు పెట్టి రాస్తున్నాయని,దానిని చూసి కొందరు రెచ్చిపోతున్నారని,పత్రికా రంగం కూడా దీనిపై పునరాలోచించాలని కోరారు. నిన్న జరిగిన ఘటన మన అసెంబ్లీ చరిత్రలో పరాకాష్ట కావాలని,భవిష్యత్తులో ఎవరూ సభలో గానీ బయట గానీ అటువంటి బూతులు మాట్లాడకుండా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.పుచ్చలపల్లి సుందరయ్య, తరిమెల నాగిరెడ్డి, తెన్నేటి విశ్వనాథం, గౌతు లచ్చన్న,వెంకయ్యనాయుడు, జయపాల్ రెడ్డి లాంటి ఎంతోమంది మహానుభావులను చూసి సభను ఎలా నడపాలో నేర్చుకునేవారని, కానీ నేడు పేపర్లో రావడానికి ఎలా మాట్లాడాలో నేర్చుకునే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి సూచించినట్లుగా భాష మీద, అసభ్యకర పదాల మీద ఒక రోజు ప్రత్యేకంగా చర్చ జరగాలని, హేట్ స్పీచెస్ కమిటీ ద్వారా దీనిపై కచ్చితంగా చర్యలు తీసుకుని పాత సాంప్రదాయాలను కాపాడాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు.

## పంచాయతీల స్వయంపాలనకు బాటలు.. సీతక్క కీలక సవరణ బిల్లు

హైదరాబాద్, గ్రామ స్వరాజ్య స్వప్నానికి నిధుల కొరత అడ్డుకట్ట వేస్తోందా? పంచాయతీల ఖజానా గల్లాపెట్టె ఇకపై ఎవరి చేతిలో ఉండనుంది? అసలు ఈ సరికొత్త సవరణ తెచ్చే మార్పులేమిటి? పూర్తి వివరాలు ఇక్కడ తెలుసుకోండి. తెలంగాణలో గ్రామ పంచాయతీల ఆర్థిక స్వేచ్ఛను మరింత పటిష్టం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చారిత్రక అడుగు వేసింది. పంచాయతీరాజ్ చట్టం-2018కి సవరణ బిల్లును పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఇప్పటివరకు గ్రామపంచాయతీలు సమకూర్చుకున్న సొంత ఆదాయం విధిగా ప్రభుత్వ ట్రెజరీ ఖాతాలో జమ అవుతుండటంతో నిధుల వాడకంలో తీవ్ర జాప్యం జరుగుతోందనే ఆరోపణలున్నాయి. తాజా సవరణ బిల్లు ప్రకారం, ఇకపై పంచాయతీలు ఆర్జించే సొంత ఆదాయాన్ని నేరుగా సమీపంలోని జాతీయ బ్యాంకులోని గ్రామ పంచాయతీ ఖాతాలో జమ చేసుకునే వెసులుబాటు లభిస్తుంది. దీనివల్ల పల్లెల్లో అత్యవసర పనులు, పారిశుద్ధ్య నిర్వహణ, కరెంట్ బిల్లుల చెల్లింపులు వంటి తక్షణ అవసరాలకు నిధుల కొరత తీరుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రభుత్వ ఖజానా ప్రమేయం లేకుండా స్థానికంగానే నిధులు అందుబాటులో ఉంటే, సర్పంచ్‌లు, పంచాయతీ



కార్యదర్శులు ఎలాంటి పరిపాలనా పరమైన జాప్యం లేకుండా అభివృద్ధి పనులను వేగవంతం చేయవచ్చు. ఒకనాడు అడుగు దూరంలో నిధులున్నా వాడుకోలేని దుస్థితి నుంచి, నేడు నేరుగా బ్యాంకు ఖాతా ద్వారా రూపాయి రూపాయికీ స్థానిక బాధ్యత పెరిగేలా ఈ చట్ట సవరణ దోహదపడుతుందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. బిల్లు ఆమోదం పొందితే పల్లె సీమల రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి.

## ఉద్యోగుల చలో హైదరాబాద్‌కు అనుమతి ఇవ్వాలి

హైదరాబాద్, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న ఉద్యోగ సంఘాలు తలపెట్టిన 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి అనుమతి ఇవ్వకుండా అడ్డుకోవడం అప్రజాస్వామిక చర్య అని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. ఉద్యోగులను భయపెట్టి తమ గుప్పిట్లో పెట్టుకోవాలని ప్రభుత్వం ప్రయత్నిస్తే అది సాధ్యం కాదని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలులో జాప్యం చేస్తోందని శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలతోపాటు ఉద్యోగులకు ఇచ్చిన హామీలు కూడా అమలు కావడం లేదన్నారు. లక్షలాది మంది ఉద్యోగుల సమస్యలను ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచి, మరో కొంతకాలం ఎలాంటి డిమాండ్లు చేయొద్దని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఉద్యోగులు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు శాంతియుతంగా చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించాలనుకుంటే అనుమతి ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీకి హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో సభ నిర్వహించుకునేందుకు అవకాశం కల్పించామని గుర్తుచేశారు. ప్రస్తుతం ఉద్యోగులు తమ సమస్యలను చెప్పుకునేందుకు కూడా అవకాశం ఇవ్వకపోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యోగులు లేకుండా ప్రభుత్వ యంత్రాంగం, పాలన ముందుకు సాగవని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో అమలు కావడానికి ఉద్యోగులే కీలకమని, అలాంటి ఉద్యోగుల సమస్యలను పట్టించుకోకుం



డా పాలన ఎలా సాగిస్తారని ప్రశ్నించారు.

పీఆర్సీ, ఓపీఎస్‌పై హామీలు ఏమయ్యాయి?

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను తీసుకొస్తామని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేస్తామని, ఆరు నెలల్లో పీఆర్సీ ప్రక్రియ పూర్తి చేస్తామని హామీ ఇచ్చిందని శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. అయితే మూడేళ్లు గడిచినా హామీలు అమలు కాలేదని ఆరోపించారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.



## సంపాదకీయం

**గురువారం 10-09-2026**

# చరిత్ర ఘనం...

ప్రజల నమ్మకమే పునాదిగా 70 వసంతాలు పూర్తిచేసుకున్న భారతీయ జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ), 'సబ్‌కా బీమా సబ్‌కీ రక్షా' నినాదంతో ముందుకు సాగుతోంది. తాజాగా ఫార్చ్యూన్-500 కంపెనీల జాబితాలో 92వ స్థానం సాధించి, రిలయన్స్(85) తర్వాత దేశంలో రెండో అతిపెద్ద సంస్థగా నిలిచింది. అయితే, వాటాల విక్రయం వంటి వాటి వల్ల భవిష్యత్తులో అనేక సవాళ్లు ఎదురుకావొచ్చు.'ప్రజల సొమ్ము ప్రజల సంక్షేమం కోసమే' అన్నది ఎల్ఐసీ వ్యవస్థాపక లక్ష్యం. దీన్ని అమలు చేయడంలో ఈ సంస్థకు అనితరసాధ్యమైన చరిత్ర ఉంది. ఎక్కువమంది ప్రజలకు బీమా రక్షణ కల్పిస్తూ, తద్వారా సమకూరిన సొమ్మును అత్యంత తక్కువ వడ్డీరేటుకే వివిధ రంగాలకు పెట్టుబడిగా అందిస్తోంది. ఇటువంటి విధులను సమర్థంగా నిర్వర్తిస్తున్న ఎల్ఐసీ- ఒక భారీ బహుళార్థ సాధక ప్రాజెక్టుకు సరిసమానంగా తులతూగుతోంది. దేశార్థిక స్వావలంబనకు వెన్నెముకగా నిలుస్తూ, ఆత్మనిర్భర్ భారత్ నినాదానికి సజీవచిత్రంగా నిలుస్తోందీ సంస్థ.

సంక్షోభంలో అండగా...

ఎల్ఐసీ తాను సేకరించిన సొమ్ములో తొంభై శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలు, బాండ్లలోనే పెట్టుబడి పెట్టాలని చట్టం నిర్దేశిస్తోంది. ఇందులో భాగంగానే రహదారులు, రైల్వే, విమానయానం, విద్యుత్, నీటిపారుదల వంటి రంగాలకు దీర్ఘకాలిక పెట్టుబడులను అందిస్తోందీ సంస్థ. అంటే ప్రజలు తమ బీమా రక్షణ కోసం దాచుకునే డబ్బులు, ప్రజాసంక్షేమ పథకాల అమలుకు పెట్టుబడులుగా మారుతున్నాయన్నమాట. ఎల్ఐసీ నిరుడు మార్చి నాటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలూ బాండ్లకు రూ. 32.47 లక్షల కోట్లు, ఇతర రంగాలకు రూ. 4.72 లక్షల కోట్లు అందించింది. ఈ ఏడాదిలోనే కేంద్రానికి రూ. 12,207 కోట్లు డివిడెండ్ రూపంలో అందజేసి, బ్యాంకులూ ఆర్థిక సంస్థల్లో అగ్రగామిగా నిలిచింది. 30కోట్లకు పైగా పాలసీదారులతో ప్రపంచ అగ్రగామి బీమా సంస్థగా అవతరించిన ఎల్ఐసీ రూ. 57.29లక్షల కోట్ల విలువైన ఆస్తులను నిర్వహిస్తూ రూ. 1.23లక్షల కోట్ల మిగులు సాధించింది. పాలసీదారులకు రూ. 59,726 కోట్లను బోనస్ రూపంలో పంచిపెట్టింది. దేశార్థిక గమనానికి సూచీగా భావించే షేర్ మార్కెట్‌లో ఒడుదొడుకులను సమర్థంగా నిలువరించడంలో ఎల్ఐసీ ఎనలేని పాత్రను పోషిస్తోంది. యూటీఐని సంక్షోభంలోంచి బయటపడేయడంలో... యెస్ బ్యాంక్, ఐడీబీఐ బ్యాంకులను గట్టెక్కించడంలో కీలకంగా మారింది. మరోవైపు యుద్ధాలు, రాజకీయ అనిశ్చితులు, 2008 నాటి ప్రపంచ సంక్షోభం వంటివి సంభవించినప్పుడు దేశీయ ఆర్థిక సూచీలు, షేర్ మార్కెట్లు కుప్పకూలిపోకుండా చూడటం ఎల్ఐసీకే చెల్లింది. బీమా కంపెనీల నిబద్ధతకూ, పనితీరుకూ వాటి క్లెయిముల పరిష్కారమే కొలమానం. ఈ అంశంలో ఏ ఇతర బీమా సంస్థ కూడా ఎల్ఐసీకి సాటి రాలేదన్నది వాస్తవం. గత ఆర్థిక సంవత్సరంలో 2.69 కోట్ల క్లెయిములపై రూ. 3.13లక్షల కోట్లు చెల్లించి బీమా రంగంలో అగ్రస్థానంలో నిలిచింది. ఇందులో డెత్, మెచ్యూరిటీ క్లెయిములు ఉన్నాయి. ఇవి కాకుండా, పీఎంజేజేబీవై (ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన) వంటి సంక్షేమ పథకాలనూ ఎల్ఐసీ నష్టాలను భరిస్తూనే నిర్విఘ్నంగా అమలు చేస్తోంది. చెప్పాలంటే, ఈ పథకం కింద నమోదయ్యే 96శాతం పాలసీలను ఎల్ఐసీయే నిర్వహిస్తోంది, మిగతా ప్రైవేటు కంపెనీలన్నీ కలిపి 4శాతం పాలసీలనే నిర్వహిస్తున్నాయి.

వాటాల విక్రయం తర్వాత...

దేశంలో 2014-15లో 3.3శాతంగా ఉన్న బీమావ్యాప్తి 2023-24 నాటికి 3.7శాతానికి పెరిగింది. బీమా సాంద్రత(తలసరి బీమా వ్యయం) 55 డాలర్ల నుంచి 95 డాలర్లకు పెరిగింది. ప్రభుత్వరంగ బీమా సంస్థల వల్లే ఇది సాధ్యపడిందని నిరుడు పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో స్పష్టంగా పేర్కొన్నారు. అయితే, ఎల్ఐసీలో వాటాల విక్రయం జరిగిన తర్వాత వ్యాపార విధానాల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. పాలసీదారులకు బోనస్‌లు పంచే పార్టిసిపేటివ్ పాలసీల స్థానంలో, నాన్-పార్టిసిపేటివ్(భాగస్వామ్యంలేని) పాలసీల విక్రయం జోరందుకుంది. నిరుడు 27.7శాతంగా ఉన్న నాన్-పార్టిసిపేటివ్ పాలసీలు ఈ ఏడాది 35.1శాతానికి పెరిగాయి. ఇటువంటి చర్యల మూలంగా, 'ముందొచ్చిన చెవులకన్నా వెనకవచ్చిన కొమ్ములు వాడి' అన్న చందంగా పాలసీదారులు ప్రభుత్వాలకు పంచే మిగులుకన్నా వాటాదారులకు పంచే మిగులు పెరుగుతూ పోతుంది. మొన్నీమధ్యనే ఎల్ఐసీలో రెండోవిడత వాటాలనూ విక్రయించారు. ఇటువంటి చర్యల వల్ల- పాలసీదారులకు బోనస్, ప్రభుత్వానికి వచ్చే డివిడెండ్ తగ్గిపోవడమే కాకుండా, దేశాభివృద్ధికి కీలకమైన నిధుల లభ్యత తెగ్గోసుకుపోవడం వంటి దుష్ఫలితాలు ఉంటాయని గ్రహించాలి. ఎల్ఐసీకి యాజమాన్య స్వతంత్రతను కలుగజేసి, వాటాల విక్రయం వంటివి చేపట్టకుండా ఉంటేనే, 2047 నాటికి 'అందరికీ బీమా' కల సాకారమవుతుంది.

# డ్రాగన్ దూకుడు ! ఈజిప్టుతో అనుబంధం..అరబ్ దేశాలతో దౌత్యం



కైరో: పశ్చిమాసియా సంక్షోభం ముదురుతున్న వేళ.. ఆ ప్రాంతంలో అమెరికా ప్రాబల్యాన్ని తగ్గించి, తనదైన ముద్ర వేయడానికి చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఇటీవల ఈజిప్టులో పర్యటించిన ఆయన.. యుద్ధానికి ముగింపు పలకాలని కోరుకుంటున్న శక్తిగా, మూసుకుపోయిన జలమార్గాలతో ఆర్థికంగా దెబ్బతిన్న దేశాల కష్టాలను అర్థం చేసుకునే భాగస్వామిగా, ఇచ్చిన మాటకు కట్టుబడే ప్రపంచ శక్తిగా చైనాను ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. పశ్చిమాసియాలో అమెరికాకు ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలన్న జిన్‌పింగ్ ప్రయత్నాల్లో ఈ పర్యటన మరో కీలక అడుగు. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు చైనాకు ఈ ప్రాంతంలో మరింత అవకాశాలను కల్పిస్తున్నాయి. అయితే.. చైనా దూకుడు కేవలం ట్రంప్ విధానాలకు ప్రతిస్పందన మాత్రమే కాదు. అమెరికా నేతృత్వంలోని భద్రత, ఆర్థిక వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా చైనాను నిలబెట్టాలన్నది జిన్‌పింగ్ కొన్నేళ్లుగా సాగిస్తున్న వ్యూహం.

నమ్మకం బాటలో డ్రాగన్

పశ్చిమాసియాలో పెరుగుతున్న దేశాలతో సంబంధాలను బలోపేతం చేసుకుంటూ చైనా తన ప్రభావాన్ని విస్తరిస్తోంది. భారీగా పెట్టుబడులు పెట్టగల ఆర్థిక సామర్థ్యం, అభివృద్ధి చెందిన రక్షణ పరిశ్రమ, పాకిస్థాన్‌తో సన్నిహిత సంబంధాలు.. ఇవన్నీ జిన్‌పింగ్‌కు కలిసొస్తున్నాయని తక్షశిల సంస్థకు చెందిన చైనా పరిశోధకురాలు అనుష్క సక్సేనా పేర్కొన్నారు. దశాబ్దాలుగా పశ్చిమాసియా దేశాలు అమెరికాతో భద్రతా సంబంధాలను కొనసాగించాయి. అమెరికా తమకు భద్రతా హామీగా నిలుస్తుందన్న నమ్మకంతోనే అవి వాషింగ్టన్‌కు దగ్గరగా ఉన్నాయి. కానీ అమెరికా-ఇరాన్ యుద్ధం సుదీర్ఘమవుతున్న కొద్దీ ఆ భద్రతా హామీపై సందేహాలు పెరుగుతున్నాయి. మరోవైపు హోర్ముజ్ జలసంధిలో నౌకాయానం ప్రమాదకరంగా మారడం ఈ ప్రాంత ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీస్తోంది. దీంతో భద్రత, ఆర్థిక భాగస్వామ్యాల కోసం అరబ్ దేశాలు చైనా వైపు మరింతగా చూస్తున్నాయని విశ్లేషణ.

ట్రంప్ వైఖరికి భిన్నంగా..

పశ్చిమాసియాలో అమెరికా ప్రాధాన్యాన్ని దేశాలు పునఃపరిశీలిస్తున్న సమయంలో.. జిన్‌పింగ్ మాత్రం తన మాటలతో ప్రాంతీయ దేశాలకు చేరువయ్యే ప్రయత్నం చేస్తున్నారు. ఇతర దేశాల జోక్యాన్ని తిరస్కరించి.. తమ వ్యవహారాలను తామే నిర్ణయించుకోవాలని పశ్చిమాసియా దేశాలకు పిలుపునిచ్చారు.

గాజా, వెస్ట్‌బ్యాంక్ విషయంలో ట్రంప్ ఇజ్రాయెల్‌కు మద్దతుగా వ్యవహరిస్తున్న తరుణంలో.. పాలస్తీనా సమస్య పశ్చిమాసియాలో అత్యంత కీలకమైన అంశమని, దాన్ని పక్కన పెట్టరాదని జిన్‌పింగ్ స్పష్టం చేశారు. అదే సమయంలో స్వేచ్ఛాయుత నౌకాయానానికి చైనా మద్దతు ప్రకటించింది. అమెరికా-ఇరాన్ యుద్ధం కారణంగా హోర్ముజ్ జలసంధి మూసివేత, ఎర్ర సముద్రంలో ఏర్పడుతున్న ముప్పు.. ప్రపంచ వాణిజ్యానికి తీవ్ర సమస్యగా మారిన నేపథ్యంలో ఈ అంశాన్ని జిన్‌పింగ్ ప్రస్తావించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

సీసీతో జిన్‌పింగ్ జోడీ

ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫతాహ్ అల్ సీసీని పశ్చిమాసియాలో తన వ్యూహానికి కీలక భాగస్వామిగా జిన్‌పింగ్ ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. ఇరు దేశాల మధ్య సంబంధాలను 'విన్-విన్' భాగస్వామ్యంగా ఇరువురు నేతలు అభివర్ణిస్తున్నారు. ఈజిప్టు ఆటోమొబైల్ రంగంలో చైనా పెట్టుబడులు పెడుతోంది. ప్రజా మౌలిక వసతుల నిర్మాణంలో సహకరిస్తోంది. ఫ్రాన్స్ రఫేల్ విమానాలకు పోటీగా నిలిచే యుద్ధ విమానాలను కూడా ఈజిప్టుకు అందించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రతిగా పశ్చిమాసియాలో చైనా చేపడుతున్న దౌత్య కార్యక్రమాలకు ఈజిప్టు మద్దతు ఇస్తోంది. అమెరికా-ఇరాన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు పాకిస్థాన్ నేతృత్వంలో జరుగుతున్న మధ్యవర్తిత్వ ప్రయత్నాలకు ఈజిప్టు మద్దతు ఇచ్చింది. అదే సమయంలో టర్కీ, సౌదీ అరేబియాతో కలిసి శాంతి మార్గాన్ని అన్వేషించే ప్రయత్నాల్లోనూ ఈజిప్టు భాగస్వామిగా ఉంది.

సూయెజ్ కారణంగానే

సూయెజ్ కాలువపై కీలక భౌగోళిక స్థానం కలిగిన ఈజిప్టుకు చైనాతో సన్నిహిత సంబంధాలు వ్యూహాత్మకంగా ఉపయోగపడతాయని విశ్లేషకులు చెబుతున్నారు. సరఫరా మార్గాలకు భద్రత కల్పించుకోవడం, ప్రాంతీయ శాంతి ప్రయత్నాలకు ఒక అగ్రరాజ్య ఆర్థిక, దౌత్య మద్దతు పొందడం.. ఈజిప్టు ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటాయని వారి అభిప్రాయం. మధ్యవర్తిత్వ ప్రయత్నాల్లో పశ్చిమ దేశాల పాత్ర తగ్గడం, కీలక సముద్ర వాణిజ్య మార్గాలను మూసివేయడం ద్వారా ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం కలిగే అవకాశాలున్నా ట్రంప్ వెనుకాడకపోవడం.. పశ్చిమాసియా దేశాలను చైనా వైపు వేగంగా మళ్లిస్తున్న రెండు ప్రధాన కారణాలని సక్సేనా పేర్కొన్నారు.

మిగతా దేశాలకూ ఇదే బాట?

ఈజిప్టుతో చైనా పెంచుకుంటున్న సంబంధాలు.. పశ్చిమాసియాలోని ఇతర దేశాలతో బీజింగ్ అనుసరించబోయే వ్యూహానికి నమూనాగా మారే అవకాశముంది. సౌదీ అరేబియాతో పాకిస్థాన్‌కు ఉన్న పరస్పర రక్షణ ఒప్పందం నేపథ్యంలో.. చైనా నుంచి ఆధునిక సైనిక సాంకేతికతను సౌదీ కొనుగోలు చేసేందుకు పాకిస్థాన్ సహకరించాల్సి ఉంది. ఇక ఈజిప్టుతో మాత్రం చైనా బహిరంగంగానే రక్షణ సంబంధాలను విస్తరిస్తోంది. ఇటీవల తొలిసారిగా జరిగిన చైనా-ఈజిప్టు సంయుక్త వైమానిక సైనిక విన్యాసాల్లో చైనా భారీ సంఖ్యలో యుద్ధ విమానాలు, బహుళ ప్రయోజన విమానాలు, డ్రోన్లను ఈజిప్టుకు తరలించింది. ఈ నేపథ్యంలో ఈజిప్టు తన రక్షణ సామర్థ్యాన్ని మరింత పెంచుకునేందుకు చైనా నుంచి భారీగా యుద్ధ విమానాలు, డ్రోన్లు కొనుగోలు చేసే అవకాశం ఉందని సక్సేనా అంచనా వేశారు.


అరబ్ ప్రపంచంలో కొత్త భద్రతా వ్యవస్థ?

అరబ్ ప్రపంచంలోనే అతిపెద్ద సైన్యాన్ని కలిగి ఉన్న ఈజిప్టు.. చైనాతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకుంటే, పశ్చిమాసియాలో కొత్త భద్రతా వ్యవస్థకు జిన్‌పింగ్ చేస్తున్న ప్రతిపాదనకు సీసీ మద్దతు ఇవ్వడం సహజమేనని విశ్లేషకులు చెబుతున్నారు. పశ్చిమ దేశాల జోక్యం తక్కువగా ఉండేలా.. అరబ్ దేశాలే తమ ప్రాంతీయ భద్రత, రాజకీయ భవిష్యత్తును నిర్ణయించుకునే వ్యవస్థను ఏర్పాటు చేయాలన్న ఆలోచన ఈజిప్టుకు ఆకర్షణీయంగా కనిపిస్తోంది.

పాకిస్థాన్.. మరో బలం

పశ్చిమాసియాలో చైనాకు ఈజిప్టు ఒక ప్రవేశ ద్వారంగా మారుతుంటే.. ఆ ప్రభావాన్ని మరింత విస్తరించడంలో పాకిస్థాన్ కీలకంగా వ్యవహరిస్తోంది. ప్రాంతీయ దేశాలు తమ సమస్యలను తామే పరిష్కరించుకోవాలన్న విధానానికి చైనా మద్దతు ప్రకటిస్తోంది. 'ఇతర దేశాల జోక్యం వద్దు.. సార్వభౌమత్వాన్ని గౌరవించాలి' అన్న సిద్ధాంతాన్ని ముందుకు తెస్తోంది. ఈ విధానానికి పాకిస్థాన్ మద్దతు ఇవ్వడమే కాకుండా.. చైనా ప్రాంతీయ శక్తిగా ఎదగడానికి అవసరమైన సహకారాన్ని కూడా అందిస్తోంది. దీంతో చైనా-పాకిస్థాన్ మధ్య దౌత్య సమన్వయం మరింత బలపడుతోంది. టర్కీ, సౌదీ అరేబియాలతోనూ ఈ రెండు దేశాలు కలిసి.. యుద్ధానంతర పశ్చిమాసియా ఎలా ఉండాలన్న అంశంపై ఒకే రకమైన అభిప్రాయాలను ముందుకు తెస్తున్నాయి. మొత్తంగా చూస్తే.. అమెరికా-ఇరాన్ ఘర్షణ పశ్చిమాసియాలో కేవలం యుద్ధ సమీకరణాలనే కాదు.. భవిష్యత్తు భద్రత, ఆర్థిక, దౌత్య వ్యవస్థ రూపురేఖలనూ మార్చే పరిస్థితిని సృష్టిస్తోంది. అమెరికా ప్రభావం తగ్గుతున్న కొద్దీ.. ఆ ఖాళీని పూడ్చేందుకు చైనా వేగంగా అడుగులు వేస్తుండటం ఇప్పుడు పశ్చిమాసియాలో కొత్త శక్తి సమీకరణాలకు దారితీస్తోంది.

# రూ. కోట్లలో లంచాలు.. గ్రీన్ కార్డుల విక్రయం..




వాషింగ్టన్,అమెరికా కలని నిజం చేసుకోవడం ఇంత తేలికా.. టోఫెల్ రాయక్కర్లేదు.. ఇంటర్వ్యూకి వెళ్లక్కర్లేదు.. కనీసం మీ బ్యాక్‌గ్రౌండ్ చెక్ కూడా అవసరం లేదు.. కేవలం 'చాట్ అండ్ క్యాష్' మోడల్‌తో గ్రీన్ కార్డులు కట్టబెట్టేసే ఒక స్వచ్ఛంద "ఇమ్మిగ్రేషన్ సెంటర్"ను అమెరికా ఫెడరల్ అధికారులు హఠాత్తుగా మూసేశారు. క్యూలో నిలబడి.. ఏళ్ల తరబడి వేచి చూసే పిచ్చివాళ్లంతా ఒకవైపు ఉంటే.. వాట్సాప్‌లో మెసేజ్ కొట్టి జెల్లే లో డాలర్లు పంపగానే గ్రీన్ కార్డు హోమ్ డెలివరీ చేసేసే ఈ మహాదాతను.. ఆయన 'క్యాష్ యాప్' పార్ట్‌నర్‌ను అర్థాంతరంగా అరెస్ట్ చేసి అధికారులు ఆ అమాయక "సేవలకు" విఘాతం కలిగించారు. అమెరికా ఇమ్మిగ్రేషన్ వ్యవస్థ విశ్వసనీయతను ప్రశ్నించేలా ఒక భారీ అవినీతి కుంభకోణం వెలుగులోకి వచ్చింది. డబ్బులు తీసుకుని అక్రమంగా గ్రీన్ కార్డులు.. అమెరికా పౌరసత్వం కట్టబెడుతున్నారనే తీవ్ర ఆరోపణలపై యునైటెడ్ స్టేట్స్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్.సీఐఎస్) మాజీ సీనియర్ అధికారి లుక్మన్ ఒవోలాబి గనియును ఫెడరల్ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఆయనకు సహకరించిన అడెనియి అకీమ్ సోమోయే అనే మరో వ్యక్తిని కూడా సెప్టెంబర్ 2న అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

అవినీతి నెట్‌వర్క్.. అసలు ఏం జరిగింది?

ఫెడరల్ ప్రాసిక్యూటర్ల కథనం ప్రకారం.. 2019 డిసెంబర్ నుండి 2026 మార్చి వరకు గనియు తన అధికారిక హోదాను తీవ్రంగా దుర్వినియోగం చేశారు. ఇమ్మిగ్రేషన్ ప్రక్రియలో అత్యంత కీలకమైన బ్యాక్‌గ్రౌండ్ వెరిఫికేషన్లు.. నేరుగా నిర్వహించే ఫెడరల్ ఇంటర్వ్యూలు, సూపర్‌వైజర్ల పర్యవేక్షణ వంటి ప్రామాణిక నిబంధనలను పక్కనపెట్టి లంచాలు చెల్లించిన దరఖాస్తుదారులకు వేగంగా ఆమోదముద్ర వేశారు. ఈ అక్రమ వ్యవహారంలో సోమోయే మధ్యవర్తిగా వ్యవహరిస్తూ దరఖాస్తుదారుల నుంచి భారీగా నిధులు సేకరించినట్లు విచారణలో తేలింది. వీరిద్దరి మధ్య దరఖాస్తుల వేగవంతం, లంచాల వసూళ్లపై విస్తృతంగా వాట్సాప్ సంభాషణలు జరిగినట్లు దర్యాప్తు సంస్థలు ఆధారాలు సేకరించాయి.

అకౌంట్లలో రూ. కోట్ల మేర అనుమానాస్పద లావాదేవీలు

దర్యాప్తు పత్రాల ప్రకారం.. గనియు బ్యాంకింగ్ లావాదేవీలపై అధికారులు తీవ్రంగా దృష్టి సారించారు. ఎలాంటి సరైన వివరణ లేని 2,87,830 డాలర్ల నగదు ఆయన ఖాతాల్లో డిపాజిట్ అయినట్లు గుర్తించారు. జెల్లీ , క్యాష్ యాప్ వంటి యాప్‌ల ద్వారా మరో 6,71,438 డాలర్ల చెల్లింపులు జరిగినట్లు తేలింది. ఈ మొత్తంలో అత్యధిక భాగం ఇమ్మిగ్రేషన్ లబ్ధిదారుల నుంచే వచ్చినట్లు ప్రాసిక్యూషన్ ఆధారాలు సమర్పించింది. 2018 నవంబర్‌లో యూఎస్.సీఐఎస్‌లో చేరిన గనియు, కాన్సాస్, టెక్సాస్, నార్త్ కరోలినాల్లో సేవలందించారు. 2024 ఏప్రిల్‌లో డల్లాస్‌లో సీనియర్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందిన ఆయన 2026 మార్చి 21న హఠాత్తుగా వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశారు.

నిందితుడి ఖండన.. కఠిన షరతులతో బెయిల్

ఈ ఆరోపణలను గనియు తరపు న్యాయవాది అల్ఫోన్సో కబానాస్ పూర్తిగా తోసిపుచ్చారు. తన క్లయింట్ ఎలాంటి నేరానికి పాల్పడలేదని.. ఫెడరల్ ప్రభుత్వం చూపుతున్న ఆర్థిక లావాదేవీల లెక్కలు సత్యదూరమని వాదించారు. విచారణ పూర్తయ్యే వరకు కస్టడీలోనే ఉంచాలని ప్రాసిక్యూటర్లు కోరినప్పటికీ కోర్టు కొన్ని కఠిన నిబంధనలతో గనియుకు బెయిల్ మంజూరు చేసింది. జీపీఎస్ ట్రాకింగ్, ప్రయాణాలపై ఆంక్షలు విధించడంతో పాటు ఆయన వద్ద ఉన్న అమెరికా, నైజీరియా పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకోవాలని కోర్టు ఆదేశించింది. ఈ నేరం నిరూపితమైతే ఇద్దరు నిందితులకు ఐదేళ్ల వరకు ఫెడరల్ జైలు శిక్షతో పాటు 2.5 లక్షల డాలర్ల (సుమారు రూ. 2 కోట్లకు పైగా) జరిమానా పడే అవకాశం ఉంది. ప్రస్తుతం యూఎస్.సీఐఎస్ ఆఫీస్ ఆఫ్ ఇన్వెస్టిగేషన్స్, హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ, ఎఫ్‌బీఐ డల్లాస్ ఫీల్డ్ ఆఫీస్ సంయుక్తంగా ఈ కేసును తదుపరి విచారణ చేస్తున్నాయి.

# బైక్ దొంగల ఆటకు పోలీసుల చెక్..

నరసరావుపేట: నరసరావుపేట పట్టణంలో వరుసగా జరుగుతున్న మోటార్ సైకిల్ దొంగతనాలకు పోలీసులు చెక్ పెట్టారు. ప్రత్యేక దృష్టి సారించి సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించిన నరసరావుపేట 1వ పట్టణ పోలీసులు ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 22 దొంగిలించబడిన మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 14 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. నరసరావుపేట డీఎస్పీ ఎం. హనుమంతరావు ఆదేశాల మేరకు నరసరావుపేట 1వ పట్టణ సీఐ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ప్రధాన నిందితుడైన ×యన్నబత్తుని మణికంఠ (22) ను సెప్టెంబర్ 6న సాయంత్రం 6.30 గంటలకు నరసరావుపేట టౌన్ ఫస్ట్ గేట్ నుంచి షాలేం నగర్ వైపు వెళ్లే రహదారిలో అరెస్ట్ చేశారు. మార్చి నుంచి ఆగస్టు వరకు వరుస దొంగతనాలు..పోలీసుల విచారణలో నిందితుడు

# సింహపురిలో రియల్ జోరు

నెల్లూరు,నెల్లూరు నగరంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కొత్త దారిలో వెళ్తోంది. నగర పరిధిలోని కీలకమైన మినీ బైపాస్ రోడ్డు, కృష్ణపట్నం పోర్ట్ కనెక్టివిటీ రహదారుల పొడవునా సెమీ-లగ్జరీ అపార్ట్‌మెంట్లు, ఆధునిక కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు భారీగా పుంజుకున్నాయి. జాతీయ రహదారి కి, పోర్ట్ రవాణా కారిడార్‌కు అనుసంధానంగా ఉన్న ఈ ప్రాంతాలు నివాస , వ్యాపార అవసరాలకు అనువుగా మారడంతో డెవలపర్లు సరికొత్త ప్రాజెక్టులతో ముందుకు వస్తున్నారు. కృష్ణపట్నం పోర్ట్ ఆధారిత లాజిస్టిక్స్, షిప్పింగ్ సంస్థలు, మైనింగ్ , మల్టీ-మోడల్ ట్రాన్స్‌పోర్ట్ రంగాలు శరవేగంగా విస్తరిస్తుండటంతో నెల్లూరు నగరంలో ఆయా కంపెనీల అధికారులు, ఇంజనీర్ల నివాస అవసరాలు పెరిగాయి. దీనికి తోడు మెరుగైన అద్దె ఆదాయం వస్తుండటంతో విదేశాల్లో ఉండే నెల్లూరు జిల్లావాసులు తమ పెట్టుబడులను మినీ బైపాస్ పరిసరాల్లోని సెమీ-లగ్జరీ ఫ్లాట్లు, కమర్షియల్ ప్రాపర్టీలపై కేంద్రీకరిస్తున్నారు. సేఫ్ ఇన్వెస్ట్‌మెంట్‌గా భావిస్తూ ముందస్తుగానే అపార్ట్‌మెంట్లను బుక్ చేసుకుంటున్నారు. మినీ బైపాస్ పరిసర ప్రాంతాలు నగరంలోని ప్రధాన ఆసుపత్రులు, విద్యాసంస్థలు, షాపింగ్ మాల్స్‌కు సమీపంలో ఉండటం కూడా కొనుగోలుదారులను విశేషంగా ఆకట్టుకుంటోంది. గతంలో కేవలం ఇండిపెండెంట్ ఇళ్లకు ప్రాధాన్యత ఇచ్చిన స్థానికులు, ఇప్పుడు సెక్యూరిటీ, పవర్ బ్యాకప్, జిమ్, కార్ పార్కింగ్ వంటి వసతులు ఉండే గేటెడ్ కమ్యూనిటీల వైపు మొగ్గు చూపుతున్నారు. దీనివల్ల ఇక్కడ చదరపు అడుగు ధర రూ. 4,000 నుంచి రూ. 6,000 వరకు పలుకుతోంది. పరిశ్రమల అభివృద్ధి, పోర్ట్ ఆధారిత వ్యాపారాల విస్తరణతో నెల్లూరు నగరం దక్షిణ కోస్తాలో కీలకమైన లాజిస్టిక్స్ హబ్‌గా రూపాంతరం చెందుతోంది. పొట్టి శ్రీరాములు నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ ఆమోదిత ప్రాజెక్టులకు డిమాండ్ నిరంతరం పెరుగుతుండటంతో, రాబోయే రోజుల్లో మినీ బైపాస్ మరియు పోర్ట్ రోడ్డు కారిడార్లలో ఆస్తుల విలువలు మరింత పెరిగే అవకాశం ఉందని రియల్టీ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# ట్రాన్స్ జెండర్ల ఆగడాలకు చెక్

హైదరాబాద్,హైదరాబాద్ నగరంలో శుభకార్యాలు జరుగుతున్న ఇళ్లపై కొందరు ట్రాన్స్‌జెండర్ల పేరుతో చేస్తున్న దాడిపై తెలంగాణ పోలీసులు అప్రమత్తమయ్యారు. అక్రమ వసూళ్లు , బెదిరింపుల దందాపై తెలంగాణ పోలీస్ శాఖ తీవ్రంగా స్పందించింది. ఇటీవల చింతల్ ప్రాంతంలో జరిగిన ఒక గృహప్రవేశ కార్యక్రమంలో రూ. 50,000 నగదు డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులను ఇంట్లోకి వెళ్లకుండా అడ్డుకున్న ఘటన కలకలం రేపింది. ఈ క్రమంలో బాధితుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం, శాపనార్థాలు పెట్టడంపై తీసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంపై తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి బలవంతపు వసూళ్లపై రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక పోలీస్ డ్రైవ్ నిర్వహించాలని ఆయన పోలీసు కమిషనర్లను ఆదేశించారు. సెప్టెంబర్ 4న చింతల్‌లోని తమ నూతన గృహంలోకి అడుగుపెడుతున్న ఒక కుటుంబాన్ని కొందరు ట్రాన్స్‌జెండర్లు అడ్డుకున్నారు. అంత పెద్ద మొత్తంలో డబ్బులు ఇచ్చుకోలేమని ఆ కుటుంబం వేడుకున్నప్పటికీ, వారు వినిపించుకోకుండా తీవ్ర పదజాలంతో దూషించారు. సామాజిక మాధ్యమాల్లో బాధితులు పంచుకున్న ఈ వీడియో వైరల్ కావడంతో పోలీసుల రక్షణ పై ప్రశ్నలు రేకెత్తించింది. ఈ తరహా ఉదంతాలపై ఫిర్యాదులు పెరగడంతో, గతంలో తాను హైదరాబాద్ సీపీగా ఉన్నప్పుడు చేపట్టిన ప్రత్యేక అణచివేత చర్యలను రాష్ట్రవ్యాప్తంగా మళ్లీ పునరావృతం చేయాలని డీజీపీ అధికారులకు స్పష్టం చేశారు. పోలీసు చర్యలు కేవలం అక్రమ దందాలు, బెదిరింపులకు పాల్పడే నేరపూరిత మూకల పైనే ఉంటాయని, ఇవి మొత్తం ట్రాన్స్‌జెండర్ సమాజానికి వ్యతిరేకం కాదని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇప్పటికే ట్రాన్స్‌జెండర్ల జీవనోపాధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని గుర్తుచేశారు. నగరంలో ఇప్పటికే పలువురు ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ అసిస్టెంట్లుగా, ఇతర ప్రభుత్వ శాఖల్లో బాధ్యతాయుతంగా ఉద్యోగాలు చేస్తూ సమాజంలో గౌరవప్రదమైన జీవనం సాగిస్తున్నారని ఆయన గుర్తుచేశారు. ఉపాధి కల్పిస్తున్న ప్రభుత్వ చర్యలను వాడుకుంటూ గౌరవంగా జీవించే వారిని, దందాలు , భయానక వసూళ్లకు పాల్పడే మూకలను వేర్వేరుగా చూస్తామని పోలీస్ యంత్రాంగం తేల్చిచెప్పింది. రాబోయే రోజుల్లో హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లాల్లోని కమిషనరేట్లు, ఎస్పీ కార్యాలయాల పరిధిలో నిఘా పెంచి, ఇటువంటి బలవంతపు వసూళ్ల ముఠాలపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. శుభకార్యాలు చేసుకునే సామాన్య ప్రజలను భయాందోళనలకు గురిచేస్తే చట్టపరమైన పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

# గెస్ట్ ఫ్యాకల్టీ పై లైంగిక దాడి.. హైదరాబాద్ జేఎన్టీయూలో దారుణం

హైదరాబాద్ ,ప్రొఫెసర్ అంటే ఉద్యోగం కాదు.. అది ఒక పవిత్రమైన బాధ్యత. రేపటి సమాజాన్ని తీర్చిదిద్దే యువతకు పాఠాలు చెప్పి.. మార్గదర్శనం చేయాల్సిన స్థానంలో ఉన్న ఒక వ్యక్తి.. ఇంతటి నీచమైన పనులకు పాల్పడటం క్షమించరాని నేరం. విద్యాబుద్ధులు నేర్పే ఆలయం లాంటి విశ్వవిద్యాలయంలో ఇలాంటి దారుణాలు చోటుచేసుకోవడం.. యావత్ మానవత్వానికే సిగ్గుచేటు. హైదరాబాద్‌లోని ప్రముఖ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నొలాజికల్ యూనివర్సిటీలో జరిగిన ఒక ఘటన విద్యా వ్యవస్థకే మచ్చ తెచ్చింది. జేఎన్‌టీయూలో పనిచేసే ఒక ప్రొఫెసర్, అదే యూనివర్సిటీలో ఉన్న ఒక గెస్ట్ ఫ్యాకల్టీ మహిళపై దారుణానికి ఒడిగట్టాడు. వీరిద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందినవారమని నమ్మించి.. మొదట బాధితురాలిని తన బుట్టలో వేసుకున్నాడు. ఆ తర్వాత అసలు రంగు బయటపెట్టాడు. ఆ ప్రొఫెసర్.. నిన్ను ఉద్యోగం నుంచి తీసేస్తాను అంటూ నిత్యం బెదిరింపులకు పాల్పడుతూ.. ఆమెపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. భయంతో ఆమె ఈ విషయాన్ని ఎవరికీ చెప్పలేకపోయింది. పని ఉందనే సాకుతో బాధితురాలిని అర్ధరాత్రి వరకు తన ఛాంబర్‌లో ఉంచుకోవడం.. దీనివల్ల ఆమె భార్యాభర్తల మధ్య విభేదాలు రావడం.. చివరకు ఆ ప్రొఫెసర్ ఆమె కాపురాన్ని కూడా కూల్చేయడం జరిగింది. ఒంటరిగా ఉంటున్న బాధితురాలి నిస్సహాయతను అవకాశంగా మలుచుకున్న ఆ కీచక ప్రొఫెసర్, శారీరకంగా.. మానసికంగా మరింతగా వేధించాడు. రోజురోజుకూ ప్రొఫెసర్ వేధింపులు పెరిగిపోవడంతో.. వాటిని తట్టుకోలేకపోయిన బాధితురాలు తీవ్ర మానసిక వేదనకు గురైంది. ఆఖరికి ధైర్యం చేసి పోలీసులను ఆశ్రయించగా.. కేపీహెచ్‌బీ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జీఎన్టీయూ లాంటి విద్యా సంస్థలో ఇలాంటి ఘటన జరగడంతో.. అక్కడ చదువుతున్న విద్యార్థులు.. పనిచేస్తున్న ఉద్యోగులు భయాందోళనకు గురవుతున్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రొఫెసర్ వృత్తికి మచ్చ తెచ్చిన ఈ నిందితుడిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి దారుణాలు మరోసారి జరగకుండా ఉండాలంటే.. విద్యా సంస్థల్లో మహిళల భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

నీలగిరి శంఖారావమ్ తెలుగు దినపత్రిక



## నన్ను పర్సనల్ గా కలిస్తే... మార్కులిస్తా

న్యూఢిల్లీ, దేశంలోనే ఎంతో ప్రసిద్ధి చెందిన జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)లో మరోసారి తీవ్ర స్థాయి లైంగిక వేధింపుల ఆరోపణలు వెలుగుచూశాయి. ఒక ప్రొఫెసర్ తమ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని, ఆయనతో గడిపితే పరీక్షల్లో ఎక్కువ మార్కులు వేస్తానని ఆశచూపాడని ఆరోపిస్తూ.. ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 11 మంది విద్యార్థినులు విశ్వవిద్యాలయ అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసీసీ)ని ఆశ్రయించారు. ఈ తీవ్రమైన ఆరోపణల ఆధారంగా ఐసీసీ విచారణను వేగవంతం చేసింది. ముఖ్యంగా ఫిర్యాదు చేసిన విద్యార్థినులే స్వయంగా తమ ఎదుట హాజరై.. వాంగ్మూలాలు ఇవ్వాలని సూచించిందిమే మొదటి వారంలో జరిగిన వైవా పరీక్షల అనంతరం విద్యార్థులు మాత్రమే ఉన్న ఒక వాట్సాప్ గ్రూప్‌లో వచ్చిన మెసేజ్‌లు ఈ దారుణాన్ని వెలుగులోకి తెచ్చాయి. ముఖ్యంగా వైవా సమయంలో సదరు ప్రొఫెసర్ నుంచి తనకు ఎదురైన చేదు అనుభవాన్ని ఒక విద్యార్థిని ఆ గ్రూప్‌లో పంచుకుంది. ఈ సమాచారాన్ని చూసిన మరికొందరు విద్యార్థినులు ధైర్యం తెచ్చుకుని.. తమకు కూడా అదే ప్రొఫెసర్ నుంచి అలాంటి అనుభవాలే ఎదురయ్యాయని బయటకు చెప్పారు. వైవా సమయంలో ప్రొఫెసర్ లైంగిక ధ్వని ఉన్న వ్యాఖ్యలు చేయడమే కాకుండా, తనతో గడిపితే అదనపు మార్కులు వేస్తానని ఆశ చూపినట్లు విద్యార్థినులు ఆరోపించారు.కేవలం వైవా పరీక్షల సమయంలోనే కాకుండా.. జేఎన్‌యూ క్యాంపస్‌లో తన అధికారిక నివాసంలో నిర్వహించే సమావేశాలకు విద్యార్థినులను ఆహ్వానించి, అక్కడ కూడా లైంగికంగా వేధించేవాడని బాధితురాళ్లు ఆరోపిస్తున్నారు. తరగతి గదుల్లో పాఠాలు చెప్పే సమయంలోనూ అసభ్యకరమైన, అనుచితమైన కామెంట్లు చేసేవాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. మే నెలలో ఫిర్యాదు నమోదు కాగానే విశ్వవిద్యాలయానికి దాదాపు 45 రోజుల పాటు సెమిస్టర్ సెలవులు వచ్చాయి. జూలైలో తిరిగి తరగతులు ప్రారంభమయ్యాక ఈ వ్యవహారం క్యాంపస్‌లో మళ్లీ తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ క్రమంలోనే సీనియర్ విద్యార్థినులు సహా మరికొందరు ముందుకు వచ్చి ఆ ప్రొఫెసర్‌పై మరిన్ని ఫిర్యాదులు చేశారు. అయితే ప్రస్తుతం ఇది అంతర్గత విచారణలో ఉన్నందున ఏ వ్యాఖ్య చేయలేమని ఐసీసీ తెలిపగా.. జేఎన్‌యూ యాజమాన్యం కూడా ఇప్పటి వరకు దీనిపై అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. గతంలో కూడా జపాన్ రాయబార కార్యాలయ మహిళా అధికారితో అసభ్యకరంగా ప్రవర్తించిన స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ స్టడీస్ సీనియర్ ప్రొఫెసర్ స్వరణ్ సింగ్‌ను ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఉద్యోగం నుంచి తొలగించిన ఉదంతాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటున్నారు.

## ఫించన్ల పండుగకు బృహత్తర అడుగు

ఒంగోలు ,ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి మరో బృహత్తర అడుగు వేసింది. ఇప్పటికే ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా దేశంలోనే అత్యధికంగా 62 లక్షల మందికి ప్రతి నెలా ఒకటో తేదీనే సామాజిక భద్రత పింఛన్లు అందిస్తూ పేదల పండుగ ను నిర్వహిస్తున్న ప్రభుత్వం, తాజాగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకాన్ని విస్తరించాలని నిర్ణయించింది. సాంకేతిక , ఇతర కారణాల వల్ల ఇప్పటివరకు పింఛను అందుకోలేకపోయిన పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు , ఇతర వృత్తుల వారికోసం సెప్టెంబర్ 7 నుంచి 16వ తేదీ వరకు కొత్త దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో అందుబాటులో ఉండే నిర్దేశిత ఫారాల ద్వారా అర్హులందరూ తమ పత్రాలను సమర్పించవచ్చని అధికార యంత్రాంగం వెల్లడించింది.అర్హుల ఎంపికలో ఎలాంటి జాప్యానికి, అవకతవకలకు తావులేకుండా ప్రభుత్వం అత్యంత పారదర్శకమైన, స్పష్టమైన సమయ పట్టికను ఖరారు చేసింది. సెప్టెంబర్ 7?16 మధ్య ఈ-కేవైసీ, ఆన్‌లైన్ నమోదు పూర్తయ్యాక, సెప్టెంబర్ 17?21 వరకు సాధారణ అర్హత పరిశీలన చేపడతారు. అనంతరం సెప్టెంబర్ 22?24 తేదీలలో భౌతిక , శాఖాపరమైన క్షేత్రస్థాయి ధృవీకరణ పూర్తి చేసి, సెప్టెంబర్ 25?26 తేదీల్లో సెర్ప్ ద్వారా బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వ ఆమోదానికి పంపుతారు. ఈ ప్రక్రియ ముగిశాక అర్హులైన అందరికీ దశలవారీగా కొత్త పింఛన్లను మంజూరు చేయను న్నారు. వివిధ కేటగిరీలకు అవసరమైన ఆధార్, రైస్ కార్డ్, సదరమ్ , ఆయా సంబంధిత శాఖల ధృవపత్రాలను జతచేసి అక్నాలెడ్జ్‌మెంట్ పొందే సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చారు.ప్రస్తుతం ప్రతి నెలా రూ.2,694 కోట్ల వ్యయంతో జనాభాలో 12.88 శాతం మందికి నెలకు రూ.4,000 నుంచి గరిష్ఠంగా రూ.15,000 వరకు భరోసా అందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 2026 సెప్టెంబర్ 1 వరకు కేవలం పింఛన్ల కోసమే ఏకంగా రూ.73,508 కోట్లు ఖర్చు చేయడం, సంక్షేమం పట్ల ప్రభుత్వాని కున్న చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలుస్తోంది. వృద్ధులు, దివ్యాంగులతో పాటు చేనేత, మత్స్యకార, కల్లుగీత కార్మికులు, ట్రాన్స్‌జెండర్లు, ఒంటరి మహిళలు సహా దాదాపు 28 రకాల ప్రత్యేక కేటగిరీలకు పింఛన్లు ఇస్తూ ఆర్థిక వెసులుబాటు కల్పిస్తున్నారు.గతంలో పింఛను పొందాలంటే సచివాలయాల చుట్టూ తిరగాల్సి రావడం, ఊహాజనిత కారణాలతో కోతలు విధించడం వంటి పరిణామాలు ఉండేవి. అయితే, ప్రస్తుత ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రమాణంగా ముందుకు సాగుతోంది. కొత్త దరఖాస్తుల స్వీకరణ ద్వారా క్షేత్రస్థాయిలో అసలైన నిరుపేదలకు, బాధితులకు 100 శాతం సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా

### సర్కార్ శుభవార్త

కొత్త ఫించన్ల కోసం ఎదురుచూస్తున్న వారికి ఏపీ సర్కార్ శుభవార్త చెప్పింది. ఎన్టీఆర్ భరోసా పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు ఫించన్లు అందించేందు సిద్ధమైంది. ఈమేరకు ప్రభుత్వం కొన్ని మార్గదర్శకాలను ప్రకటించింది. నేటి నుంచి వారం రోజుల పాటు గ్రామ వార్డు, సచివాలయాల్లో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను తీసుకోనుంది. మీ ఈ ఫించన్ ఎవరికి వస్తుంది. దీనికి అర్హులు ఎవరి, ఎలా దరఖాస్తు చేసుకోవాలి, దరఖాస్తు చేయడానికి ఏం ఏం పత్రాలు కావాలో ఇక్కడ తెలుసుకుందాం.కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. నేటి నుంచి వారం రోజుల పాటు కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు తీసుకుంటున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. గత ప్రభుత్వంలో జారీ చేసిన జీవో 174 ప్రకారమే లబ్ధిదారుల అర్హతను గుర్తించనున్నట్టు ప్రభుత్వం తెలిపింది. లబ్ధిదారుల నుంచి వచ్చిన దరఖాస్తున్నలు పూర్తిగా పరిశీలించి అర్హులైన వారికి కేటగిరీల వారీగా ఫించన్లు పంపిణీ చేయనున్నట్టు తెలిపింది. ఈ దరఖాస్తు ప్రక్రియను నేటి నుంచి స్టార్ట్ చేసి 20 రోజుల్లో పూర్తి చేయనున్నారు. ఆ తర్వాత అర్హులైన వారికి వచ్చే నెల ఒకటి నుంచి ఫించన్లు అందించనున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ దరఖాస్తు ప్రక్రియ కొనసాగనున్నట్టు అధికారులు తెలిపారు. అలాగే ఔఊచి వెబ్‌సైట్, ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు తమ దరఖాస్తు పత్రాన్ని సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్, వార్డు ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శికి ఇవ్వాలి.. అతను మీ అప్లికేషన్‌లో ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసి తర్వాత మీరు మళ్లీ ఓ రసీదు ఇస్తారు. తర్వాత మీ అప్లికేషన్లోని వివరాలను ఈకేవైసీ డేటాతో మ్యాచ్ అయితే మీ అప్లికేషన్ తర్వాత దశకు వెళ్తోంది. అలేదంటే మీ దరఖాస్తున్న ఉన్న సమస్యను తెలియజేసి సరైన డాక్యుమెంట్స్‌ను మళ్లీ సబ్‌మిట్ చేయాలని చెప్తారు.

## పథకాలు ఎన్నో.. ప్రచారం ఏది?



హైదరాబాద్, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలు కీలక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. పేదలకు సన్నబియ్యం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, కొత్త రేషన్ కార్డుల పంపిణీ, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు.. ఇలా ప్రజల రోజువారీ జీవితాన్ని నేరుగా ప్రభావితం చేసే పథకాలు, నిర్ణయాలు ఉన్నాయి. కానీ.. వీటి ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన రాజకీయ మైలేజీ మాత్రం వస్తోందా? అనే ప్రశ్న ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారుతోంది. ఎందుకంటే.. ఒకప్పుడు తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన ఘనతను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో కాంగ్రెస్ విఫలమైందనే విమర్శలు ఎదుర్కొంది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే తరహా పరిస్థితి పునరావృతమవుతోందా? పథకాలు అమలు చేస్తున్నా.. వాటి ప్రచారంలో మాత్రం పార్టీ వెనుకబడుతోందా? అన్నదే అసలు చర్చ.

### పథకాలు ఉన్నాయి.. మైలేజీ ఎక్కడ?

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో కొన్ని నేరుగా కోట్లాది మంది ప్రజలను ప్రభావితం చేస్తున్నాయి. పేదలకు సన్నబియ్యం అందించడం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం, విద్యుత్తు బిల్లుల భారం తగ్గించడం, కొత్త రేషన్ కార్డులు జారీ చేయడం, సొంత ఇల్లు లేని కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం వంటివి సాధారణ నిర్ణయాలు కావు. ముఖ్యంగా ఒక కుటుంబానికి నెలవారీ ఖర్చును తగ్గించే పథకాలు రాజకీయంగా కూడా బలమైన ఆయుధాలే. ఉచిత విద్యుత్తు వల్ల ఎంత ఆదా అవుతోంది? మహిళల ఉచిత బస్సు ప్రయాణంతో కుటుంబాలకు ఎంత భారం తగ్గుతోంది? సన్నబియ్యం వల్ల పేద కుటుంబాలకు ఎంత ప్రయోజనం కలుగుతోంది? ఇందిరమ్మ ఇల్లు మంజూరైన కుటుంబం జీవితంలో ఎలాంటి మార్పు వస్తోంది? ఈ విషయాలను లబ్ధిదారులతోనే చెప్పిస్తూ పెద్ద ఎత్తున ప్రచారం చేయగలిగితే.. కాంగ్రెస్‌కు భారీ రాజకీయ మైలేజీ వచ్చే అవకాశం ఉంది. కానీ ఆ స్థాయిలో ప్రచారం కనిపించడం లేదన్నది పార్టీకి మైనస్‌గా మారుతోంది. ప్రభుత్వం చేసిన పని కంటే.. ప్రభుత్వంపై వచ్చిన విమర్శే ఎక్కువగా ప్రజల్లో చర్చకు వస్తే అసలు కథ అక్కడే మొదలవుతుంది.

### తెలంగాణ ఇచ్చాం.. కానీ చెప్పుకోలేకపోయాం!

ఇది కాంగ్రెస్‌కు కొత్త సమస్య కాదు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలోనూ ఇదే జరిగింది. రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ తన పాత్రను ప్రజలకు బలంగా వివరించలేకపోయింది. ఫలితంగా తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర సాధనలో కాంగ్రెస్ పాత్ర కంటే.. ఇతర రాజకీయ శక్తుల కథనం ప్రజల్లో బలంగా స్థిరపడింది. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు మరోసారి అలాంటి అవకాశం ఎదురైంది. ఈసారి చేతిలో రాష్ట్ర ఏర్పాటు క్రెడిట్ కాదు.. ప్రభుత్వ పథకాలు ఉన్నాయి. సన్నబియ్యం, ఉచిత విద్యుత్తు, ఉచిత బస్సు ప్రయాణం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు సంక్షేమం.. ఇలా ఒక్కో పథకాన్ని ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పుతో అనుసంధానం చేస్తూ చెప్పుకుంటే.. “కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తోంది?” అనే ప్రశ్నకు ప్రజలే సమాధానం చెప్పే పరిస్థితి వస్తుంది. కానీ పార్టీ నేతలు ఆ కథనాన్ని నిర్మించడంలో విఫలమైతే.. ప్రతిపక్షాలు తమకు అనుకూలమైన కథనాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తాయి. ప్రభుత్వ విజయాలు పక్కకు వెళ్లి.. వైఫల్యాలు, వివాదాలు మాత్రమే ప్రధాన చర్చగా మారతాయి.

### పథకాల కంటే పంచాయతీలే హాట్ టాపిక్!

ఇక్కడే కాంగ్రెస్‌కు మరో చిక్కు ఎదురవుతోంది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కంటే.. పార్టీ నేతల మధ్య విభేదాలు, వ్యక్తిగత విమర్శలు, అంతర్గత పంచాయతీలే ఎక్కువగా వార్తల్లో నిలుస్తున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొండా సురేఖ వ్యవహారం నుంచి రాజగోపాల్ రెడ్డి వంటి నేతల వ్యాఖ్యలు, వివాదాల వరకు.. ఒక్కోసారి కాంగ్రెస్‌లోని అంతర్గత రాజకీయాలు రాష్ట్ర రాజకీయ చర్చను ఆక్రమిస్తున్నాయి. ఒక నేత చేసిన వ్యాఖ్యకు రోజంతా చర్చ జరుగుతోంది. మరో నేత స్పందిస్తారు. దానికి ఇంకొకరు కౌంటర్ ఇస్తారు. చివరకు టీవీ చర్చలు, సోషల్ మీడియా పోస్టులు, రాజకీయ కథనాలు మొత్తం ఆ వివాదం చుట్టూనే ప్రస్థతం తిరుగుతున్నాయి. అదే సమయంలో.. ఒక గ్రామంలో పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఒక మహిళ ప్రతిరోజూ ఉచిత బస్సులో ప్రయాణిస్తోంది. ఒక కుటుంబానికి ఉచిత విద్యుత్తు వల్ల బిల్లు భారం తగ్గింది. మరో కుటుంబానికి కొత్త రేషన్ కార్డు వచ్చింది. కానీ ఈ కథలు అంతగా హైలైట్ కావడం లేదు. ఇదే కాంగ్రెస్‌కు అసలు కమ్యూనికేషన్ సమస్యగా మారుతోందా? అనే ప్రశ్న ఇప్పుడు వినిపిస్తోంది.

### కాంగ్రెస్ మారాల్సింది ప్రచార వ్యూహమేనా?

ప్రభుత్వం పథకాలు అమలు చేయడం ఒక ఎత్తయితే.. వాటి ప్రయోజనాలను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పడం మరో ఎత్తు. కేవలం అధికారిక ప్రకటనలు, సభలు, ప్రభుత్వ ప్రకటనలతో సరిపోదు. ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వం చేసిన పనికి లెక్క చెప్పాలి. “మా ప్రభుత్వం వచ్చాక మీకు ఏం వచ్చింది?” అనే ప్రశ్నను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఒక మహిళకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఏడాదికి ఎంత ఆదా అయింది? ఒక రైతుకు ఉచిత విద్యుత్తు వల్ల ఎంత ప్రయోజనం వచ్చింది? ఒక పేద కుటుంబానికి సన్నబియ్యం వల్ల ఎంత భారం తగ్గింది? ఒక నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఎలా అండగా నిలిచింది? ఇవన్నీ వాస్తవాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి. అలా చేస్తే సంక్షేమ పథకం కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా మిగిలిపోకుండా.. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా విజయంగా ప్రజల్లోకి వెళ్లే అవకాశం ఉంటుంది. లేకపోతే పరిస్థితి మరోలా ఉంటుంది. ప్రభుత్వం ఎన్ని పథకాలు అమలు చేసినా.. వాటి గురించి పార్టీ కంటే ప్రతిపక్షాలే ఎక్కువగా మాట్లాడే పరిస్థితి వస్తుంది. ప్రభుత్వంలో జరిగే చిన్న వివాదం కూడా పెద్ద వార్తగా మారుతుంది. నేతల పంచాయతీలు ప్రధాన చర్చగా మారతాయి. ప్రజలకు అందుతున్న ప్రయోజనాలు మాత్రం బ్యాక్‌గ్రౌండ్‌లోకి వెళ్లిపోతాయి. అందుకే తెలంగాణ కాంగ్రెస్ ముందున్న అసలు ప్రశ్న.. “మరిన్ని పథకాలు తీసుకురావాలా?” అన్నది మాత్రమే కాదు. ఇప్పటికే అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి ఎంత సమర్థంగా తీసుకెళ్లగలుగుతారు? అన్నదే. తెలంగాణ ఇచ్చిన విషయాన్ని చెప్పుకోలేక గతంలో రాజకీయంగా నష్టపోయిన కాంగ్రెస్.. ఇప్పుడు పేదలకు అందుతున్న సంక్షేమాన్ని కూడా సరిగ్గా చెప్పుకోలేకపోతే.. చరిత్ర మళ్లీ పునరావృతమవుతుందా? పథకాలు కాంగ్రెస్‌కు ప్లస్ కావాలంటే.. పంచాయతీలు మైనస్ కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా పార్టీ నాయకత్వంపైనే ఉంది.

## అమెరికా పీచేముడ్ .. ఇరాన్ దెబ్బతో అంతర్మథనం



వాషింగ్టన్:ఇరాన్‌తో కొనసాగుతున్న ఘర్షణ అమెరికా మధ్యప్రాచ్య వ్యూహంపై ప్రభావం చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులతో అమెరికా సైనిక స్థావరాలు, గూఢచార వ్యవస్థలకు నష్టం వాటిల్లిన నేపథ్యంలో.. ఈ ప్రాంతంలో తమ సైనిక, నిఘా మౌలిక వసతులను తగ్గించే అంశంపై అమెరికా సైనిక, గూఢచార వర్గాల్లో అనధికారిక చర్చలు జరుగుతున్నట్లు ఆరు వర్గాలు వెల్లడించాయి. అయితే ఇప్పటివరకు దీనిపై అధికారిక నిర్ణయం వెలువడలేదు.

### 9/11 తర్వాత భారీ విస్తరణ

2001 సెప్టెంబరు 11 ఉగ్రదాడుల తర్వాత అమెరికా మధ్యప్రాచ్యంలో తన సైనిక, గూఢచార వ్యవస్థను గణనీయంగా విస్తరించింది. ఇరాక్, అఫ్గానిస్థాన్, సిరియా, ఇరాన్, యెమెన్, లిబియా తదితర ప్రాంతాల్లో శాశ్వత, తాత్కాలిక స్థావరాలు ఏర్పాటయ్యాయి. ఒక దశలో ఈ ప్రాంతంలో అమెరికా సైనికుల సంఖ్య భారీగా పెరిగింది.2003లో ఇరాక్‌పై అమెరికా దాడి సమయంలో సుమారు 2.5 లక్షల మంది సైనికులు అక్కడ ఉన్నారు. 2007 నుంచి 2011 మధ్య కూడా ఈ సంఖ్య లక్షకు తగ్గకుండా కొనసాగింది. ఆ తర్వాత అధ్యక్షుడు బరాక్ ఒబామా అమెరికా బలగాలను క్రమంగా తగ్గించే ప్రక్రియను ప్రారంభించారు. ఇరాక్ నుంచి యుద్ధ బలగాలను ఉపసంహరించినప్పటికీ.. ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాద సంస్థ పెరుగుదలతో అమెరికా మళ్లీ ఆ ప్రాంతంలోకి రావాల్సి వచ్చింది.

### 50 వేల మంది సైనికులు

ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో అమెరికాకు సుమారు 50 వేల మంది సైనికులు ఉన్నారు. రెండు విమాన వాహక నౌకలు, 12కు పైగా గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్లు అక్కడ మోహరించి ఉన్నాయి. ఇరాన్‌తో ఘర్షణ నేపథ్యంలో గతంలో స్వదేశానికి పంపిన కొంతమంది సీఐఏ అధికారులు కూడా తిరిగి ఈ ప్రాంతానికి వస్తున్నారు. అయితే అదే సమయంలో భవిష్యత్తులో ఈ ప్రాంతంలో అమెరికా బలగాల సంఖ్యను తగ్గించాలన్న ఆలోచనకు ప్రాధాన్యం పెరుగుతోంది.

### బంకర్లలోకి స్థావరాలు?

ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులతో అమెరికా స్థావరాల భద్రతపై ఆందోళనలు పెరిగాయి. దీంతో కీలక సైనిక మౌలిక వసతులను మరింత పటిష్ఠం చేయడంతోపాటు.. కొన్ని ప్రాంతాల్లో స్థావరాలను భూగర్భంలోకి తరలించే అవకాశాన్ని కూడా అమెరికా పరిశీలిస్తున్నట్లు సమాచారం. యుద్ధం కొనసాగుతున్నంతకాలం కీలక వైమానిక స్థావరాలను పూర్తిగా వదిలివేసే పరిస్థితి ఉండదని సైనిక వర్గాలు భావిస్తున్నాయి.

### పునర్నిర్మాణంపై సందిగ్ధత

ఇరాన్ దాడుల్లో జోర్డాన్, యూఏఈలోని అమెరికా స్థావరాలు, బహ్రెయిన్, ఖతార్, సౌదీ అరేబియా, కువైట్‌లోని సైనిక మౌలిక వసతులు దెబ్బతిన్నాయి. సౌదీ అరేబియాలోని సీఐఏ కేంద్రానికి కూడా తీవ్ర నష్టం వాటిల్లినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో దెబ్బతిన్న ప్రతి స్థావరాన్ని తిరిగి అదే స్థాయిలో నిర్మించాలా? అనే ప్రశ్న తలెత్తింది. భారీ వ్యయంతో కూడుకున్న పునర్నిర్మాణాన్ని కొన్ని సందర్భాల్లో అమెరికా ప్రభుత్వం పక్కన పెట్టే అవకాశమూ ఉందని అధికారులు చెబుతున్నారు.

### గల్ఫ్ దేశాలకే రక్షణ బాధ్యత

మధ్యప్రాచ్యంలో అమెరికా సైనిక ఉనికిని కొంతమేర తగ్గించి.. ప్రాంతీయ దేశాలే తమ రక్షణ బాధ్యతలను మరింతగా చేపట్టేలా చేయాలన్న ఆలోచన పెరుగుతోంది. గల్ఫ్ దేశాల్లోని కొన్ని ప్రాంతాల నుంచి అమెరికా బలగాలను తగ్గించే అంశంపై పెంటగాన్‌లోని కొందరు సీనియర్ అధికారులు అంతర్గతంగా అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. అయితే ఇందుకు సంబంధించి ఇప్పటివరకు అధికారిక ఫోర్స్ పోస్చర్ రివ్యూ గానీ, అధ్యక్షుడి నుంచి స్పష్టమైన ఆదేశాలు గానీ వెలువడలేదు.

### ఇప్పుడే తేల్చని ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విదేశాంగ, రక్షణ విధానాల్లో నిర్ణయాలను వేగంగా మార్చుకునే అవకాశం ఉండటంతో.. తదుపరి పరిణామాలపై అధికారుల్లోనూ స్పష్టత లేదని కథనం పేర్కొంది. ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడి పెంచడంపైనే ట్రంప్ ప్రధానంగా దృష్టి పెట్టినప్పటికీ.. ఆ ఒత్తిడి ఎప్పుడు ఫలితాన్నిస్తుందనే దానిపై స్పష్టమైన కాలపరిమితి లేదని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇరాన్ కొన్ని నెలల పాటు ఆర్థిక ఇబ్బందులను భరించే అవకాశముందని, వెంటనే లొంగిపోయే పరిస్థితి ఉండకపోవచ్చని అంచనా వేస్తున్నారు.

### బహ్రెయిన్‌కు వెళ్లేది ఎప్పుడో?

అమెరికా నౌకాదళానికి కీలక కేంద్రంగా ఉన్న బహ్రెయిన్‌లోని 5వ నౌకాదళ స్థావరానికి అమెరికా సిబ్బంది తక్షణమే తిరిగి వెళ్లే అవకాశాలు కనిపించడం లేదు. అమెరికా నేవీ ఉన్నతాధికారి అడ్మిరల్ డారిల్ కాడిల్ కూడా.. అక్కడికి సిబ్బంది ‘త్వరలో తిరిగి వెళ్లే పరిస్థితి లేదని’ స్పష్టం చేసినట్లు కథనం పేర్కొంది. దీంతో ఇరాన్‌తో ఘర్షణ ముగిసిన తర్వాత కూడా గల్ఫ్‌లో అమెరికా సైనిక ఉనికిపై పునరాలోచన కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### 25 ఏళ్ల వ్యూహానికి మలుపు?

9/11 తర్వాత దాదాపు పావు శతాబ్దంగా మధ్యప్రాచ్యంలో అమెరికా చేపట్టిన సైనిక జోక్యాలు, ఉగ్రవాద వ్యతిరేక చర్యలు, ఇరాన్‌తో పరోక్ష ఘర్షణలు.. ఆ దేశాన్ని పదేపదే ఈ ప్రాంతంలోకి లాగాయి. ఇప్పుడు ఇరాన్ దాడులతో అమెరికా స్థావరాల భద్రత, వ్యయం, సైనికుల ప్రాణనష్టం వంటి అంశాలు మరోసారి తెరపైకి రావడంతో.. మధ్యప్రాచ్యంలో అమెరికా తన పాత వ్యూహాన్ని మార్చుకుంటుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.

## బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై దాడి దారుణం

హుస్నాబాద్ : తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తూ హుస్నాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా నుంచి భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు, ప్రస్తుత మరియు మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళా నాయకులు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించేందుకు వెళుంటే వారిని పోలీసులతో అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కులపై దాడి అని హుస్నాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ మాజీ శాసనసభ్యులు శ్రీ వొడితల సతీష్ కుమార్ తీవ్రంగా ఖండించారు. ముఖ్యంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మెల్యేలు అని కూడా చూడకుండా పోలీసులు దురుసుగా వ్యవహరించడం తీవ్రంగా ఖండించదగిన విషయమని అన్నారు. అసెంబ్లీ సాక్షిగా మహిళా ప్రజాప్రతినిధుల పట్ల ఇలాంటి ప్రవర్తన జరగడం తెలంగాణ సమాజం సిగ్గుపడే విషయం. మహిళలకు గౌరవం ఇస్తామని చెప్పే కాంగ్రెస్ ప్రభుత్వం.. ఒకవైపు మహిళా సాధికారత గురించి మాట్లాడుతూనే మరోవైపు మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులతో ఇలా వ్యవహరించడం ఏ విధమైన మహిళా గౌరవం? అని సతీష్ కుమార్ ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన ఘటనకు ప్రతి మహిళా సమాజం స్పందించాలి:మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన ఘటన కేవలం బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన విషయం కాదని, ప్రజాస్వామ్యాన్ని, మహిళా గౌరవాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అంశమని సతీష్ కుమార్ అన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన మహిళా ప్రజాప్రతినిధులకే రక్షణ, గౌరవం లేకపోతే రాష్ట్రంలోని సామాన్య మహిళలకు ఈ ప్రభుత్వం ఏ విధంగా భరోసా కల్పిస్తుందని ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ హక్కుల కోసం ప్రశ్నిస్తే వారిని అడ్డుకోవడం ద్వారా మహిళల గొంతుకను కూడా అణచివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు ప్రజల్లోకి బీఆర్ఎస్ పోరుబాటకాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో ఇచ్చిన హామీలు, 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారంటీల అమలులో వైఫల్యాలను ప్రజలకు వివరించడంతో పాటు, రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, ఉద్యోగులు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు హుస్నాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వరుస నిరసన కార్యక్రమాలు చేపట్టామని సతీష్ కుమార్ తెలిపారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల ద్వారా ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వ హామీల అమలుపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే కార్యక్రమాలు నిర్వహించామని ఆయన తెలిపారు. హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో జరిగిన భారీ ధర్నా అనంతరం చేపట్టిన నిరసన ర్యాలీలో మహిళలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, యువత,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పోరాటం నిరంతరం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు.

## చైర్మన్ స్థానాన్ని దక్కించుకునేందుకు వైసిపి ముమ్మర ప్రయత్నాలు


బద్వేలు :ధిమరో రెండు మూడు నెలల్లో జరగబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో బద్వేలు మున్సిపాలిటీకి సంబంధించి చైర్మన్ రేసులో పలువురు ఆశావాహులు ఉన్నారు. మొట్టమొదటిసారిగా చైర్మన్ కు నేరుగా ఎన్నికలు జరగబోతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో అప్పట్లో బద్వేలు మున్సిపాలిటీ ఏర్పడింది. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో, ఉమ్మడి రాష్ట్రవ్యాప్తంగా మునిసిపల్ ఎన్నికలు జరిగాయి. బద్వేల్ మున్సిపాలిటీ మొట్టమొదటిసారిగా చైర్మన్ స్థానం ఎస్సీలకు రిజర్వు అయింది. అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖర్ రెడ్డి సోదరుడు అప్పటి కడప పార్లమెంట్ సభ్యుడు వైయస్ వివేకానంద రెడ్డి బద్వేలు మున్సిపాలిటీ ఎన్నికల బాధ్యతలు తీసుకున్నారు. అప్పట్లో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. మున్సిపల్ చైర్మన్ గా డాక్టర్ మునయ్య ఎన్నికయ్యారు. ఆ తరువాత జరిగిన ఎన్నికలలో చైర్మన్ బీసీలకు రిజర్వ్ అయింది. తెలుగుదేశం పార్టీ మెజార్టీ స్థానాలు గెలుచుకుంది. బిసి సామాజిక వర్గానికి చెందిన సోమేశుల పార్థసారథి చైర్మన్గా ఎన్నికయ్యారు. ఆయన ఐదు సంవత్సరాల పాటు చైర్మన్గా ఉన్నారు. ఆ తరువాత రెండు సంవత్సరాలు పాటు ప్రత్యేక పాలన వచ్చింది. తరువాత జరిగిన ఎన్నికల్లో మున్సిపాలిటీ ఓసీలకు కేటాయించారు. అప్పట్లో జరిగిన ఎన్నికల్లో వైసిపి ఘన విజయం సాధించింది. ఓసి సామాజిక వర్గానికి చెందిన వాకమల్ల రాజగోపాల్ రెడ్డి చైర్మన్ అయ్యారు. ఇప్పుడు మున్సిపల్ చైర్మన్ ఏ సామాజిక వర్గానికి రిజర్వు అవుతుంది అనే విషయంపై అన్ని పార్టీల్లో టెన్షన్ మొదలైంది. త్వరలో జరగబోయే బద్వేల్ మున్సిపాలిటీ ఎన్నికలలో అన్ని పార్టీలు సిద్ధంగా ఉన్నాయి. ప్రధానంగా తెలుగుదేశం వైసిపి ఇప్పటినుంచి రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. మున్సిపల్ చైర్మన్ రేసులో పలువురు ఆశావాహులు ఉన్నారు. కూటమి తరపున పోటీ చేసేందుకు పలువురు నాయకులు ఇప్పటినుంచి సిద్ధమవుతున్నారు. త్వరలో జరగబోయే ఎన్నికలు బద్వేలు టిడిపి ఇన్చార్జి సూర్యనారాయణ రెడ్డికి సవాలుగా మారుతున్నాయి. గత నెల రోజులుగా సూర్యనారాయణ రెడ్డి ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని ముమ్మరంగా చేస్తున్నారు. ఈ కార్యక్రమం మంచి ఫలితాలు ఇస్తుంది. కాగా ఇప్పటికే కొన్ని వందల కుటుంబాలు తాము ఉంటున్న పార్టీలు వదిలిపెట్టి తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారు. ఇది సూర్యనారాయణ రెడ్డికి ప్లస్ గా మారిందని చెప్పాలి. ఎన్నికల నాటికి మరి కొంతమందిని తెలుగుదేశం పార్టీలో చేర్చేందుకు సూర్యనారాయణ రెడ్డి ఇప్పటినుంచే పావులు కదుపుతున్నారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో చైర్మన్ స్థానంతో పాటు అన్ని కౌన్సిలర్ల స్థానాలు కూటమికి కట్టబెట్టాలని సూర్యనారాయణ రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. కూటమి తరపున పోటీ చేసేందుకు పలువురు ఇప్పటికే పోటీ పడుతున్నారు. ప్రధానంగా చైర్మన్ స్థానానికి మాజీ మున్సిపల్ చైర్మన్ పార్థసారథి పోటీ చేసే అవకాశం ఎక్కువగా ఉంది. అలాగే చైర్మన్ స్థానం కోసం పలువురు ఇప్పటినుంచి పోటీ పడుతున్నారు. తెలుగుదేశం పార్టీలో ప్రస్తుతం ఇంచార్జ్ సూర్యనారాయణరెడ్డి బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ఆమె కుమారుడు రితేష్ కుమార్ రెడ్డి వర్గాలు ఉన్నాయి. వీరిలో ఒకరంటే ఒకరికి పడడం లేదు. ఇది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం. రెండు రోజుల క్రితం బద్వేల్ కు వచ్చిన కడప పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు భూపేష్ రెడ్డి వర్గాలు కాదు పార్టీ ముఖ్యమని జరగబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని చెప్పారు. అలాగే పార్టీ ఇంచార్జ్ సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో బద్వేలు నియోజకవర్గంలో అన్ని ఎన్నికలు జరుగుతాయి. అని భూపేష్ రెడ్డి స్పష్టం చేశారు. ఏది ఏమైనాప్పటికీ త్వరలో జరగబోయే ఎన్నికలు టిడిపి ఇన్చార్జ్ సూర్యనారాయణ రెడ్డికి ఒక సవాలుగా మారబోతున్నాయి.

# ఏఐఐబీ సహకారంతో స్కూళ్లకు మహర్దశ




నల్గొండ,తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలకు సరికొత్త రూపు ఇవ్వడంతో పాటు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల (టీపీఎస్) ఏర్పాటును వేగవంతం చేస్తోంది. అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలకు దీటుగా టీపీఎస్‌లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా కొత్తగా 73 టీపీఎస్‌ల నిర్మాణానికి తాజాగా పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ పాఠశాలల నిర్మాణానికి మొత్తం రూ.699.89 కోట్లను ఖర్చు చేయనున్నారు. ఇందులో రాష్ట్ర బడ్జెట్ నుంచి రూ.209.96 కోట్లు కేటాయించగా.. మరో రూ.489.93 కోట్లను ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ రుణంగా సమకూర్చనుంది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి నిర్మాణ ప్రక్రియను వేగంగా చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు, తెలంగాణ విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎండీని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నెలలోనే నిర్మాణ పనులకు టెండర్లు పిలవనున్నట్లు టీజీఈడబ్ల్యూఐడీసీ ఎండీ గణపతిరెడ్డి తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా 100 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి గత ఫిబ్రవరిలో నిర్ణయించారు. ఇప్పటికే ఇబ్రహీంపట్నం, అచ్చంపేట నియోజకవర్గాల్లో రెండేసి చొప్పున, గజ్వేల్‌లో ఒక టీపీఎస్‌కు అనుమతులు లభించాయి. ఇబ్రహీంపట్నం పరిధిలోని ఆరుట్ల టీపీఎస్ ఇప్పటికే ప్రారంభమైంది. మిగిలిన పాఠశాలల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. తాజాగా ప్రతిపాదించిన 95 పాఠశాలల్లో 73కి ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో.. ఇప్పటివరకు మంజూరైన టీపీఎస్‌ల సంఖ్య 78కు చేరింది. మిగిలిన పాఠశాలలపై కూడా త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు భిన్నంగా టీపీఎస్‌లు సెమి రెసిడెన్షియల్ విధానంలో పనిచేయనున్నాయి. ఇప్పటికే ఉన్న ప్రభుత్వ పాఠశాలలను కూడా అవసరమైన మౌలిక వసతులతో టీపీఎస్‌లుగా తీర్చిదిద్దనున్నారు. సాధారణంగా కనీసం రెండు నుంచి మూడు ఎకరాల స్థలం ఉన్న పాఠశాలలను ఎంపిక చేసి.. వాటి పరిధిలోని సమీపంలోని మరో రెండు, మూడు పాఠశాలలను విలీనం చేసే విధానాన్ని అనుసరించనున్నారు. అవకాశం ఉన్న ప్రాంతాల్లో సమీపంలోని జూనియర్ కళాశాలలను కూడా ఈ సముదాయాల్లోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. టీపీఎస్‌లలో విద్యార్థులకు తరగతి గదులతో పాటు క్రీడా మైదానాలు, బాస్కెట్‌బాల్, వాలీబాల్ కోర్టులు, గ్రంథాలయాలు, కంప్యూటర్-సైన్స్ ల్యాబ్‌లు, ప్రీప్రైమరీ విద్యార్థుల కోసం ప్రత్యేక ఆట స్థలాలు వంటి సౌకర్యాలు కల్పించనున్నారు. ప్రీప్రైమరీ నుంచి పదో తరగతి లేదా ఇంటర్మీడియట్ వరకు నాణ్యమైన విద్యను ఒకే క్యాంపస్‌లో అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. పాఠశాలల విలీనం ద్వారా ఒక్కో టీపీఎస్‌లో విద్యార్థుల సంఖ్య కనీసం 1000 నుంచి 1500 వరకు ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఒకే ప్రాంగణంలో చదవడం ద్వారా మెరుగైన విద్యా వాతావరణం ఏర్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అదే సమయంలో ఉపాధ్యాయుల సంఖ్య పెరగడం, వనరులను సమర్థంగా వినియోగించడం వంటి ప్రయోజనాలు కూడా ఉంటాయని అధికారులు చెబుతున్నారు.సాధారణ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందుతున్న నేపథ్యంలో.. టీపీఎస్‌లలో సాయంత్రం కూడా అల్పాహారం అందించే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోంది. విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక నైపుణ్యాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచడమే టీపీఎస్‌ల ప్రధాన ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు.

# విజయసాయిరెడ్డికి మిగిలేది ఖర్చే..!



అమరావతి,ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఏళ్ల తరబడి కీలక సూత్రధారిగా, వైసీపీకి ఆయువుపట్టులా వ్యవహరించిన విజయసాయిరెడ్డి ఇప్పుడు సొంతంగా పార్టీ పెట్టేందుకు రెడీ అయ్యారు. తాను సీఎంని అవుతా అంటే ఇంకా తేడాగా ఉంటుందని .. జెన్ జీని సీఎంను చేస్తానని వింత మాటలు చెబుతూ ప్రెస్మీట్ పెట్టారు. ఆయన తీరు చూసిన వారికి ఎవరికైనా రాజకీయ ఉత్సాహం గానీ, దూకుడు గానీ కనిపించడం లేదని అనిపిస్తుంది తీవ్రమైన అలసట, ముఖంలో నీరసం స్పష్టంగా కనిపిస్తోంది. ఏదో ఒత్తిడితో ఆయన రాజకీయ ప్రకటన చేస్తున్నట్లుగా కనిపిస్తోంది.

విజయసాయిరెడ్డి బలం డబ్బు

విజయసాయిరెడ్డికి ఉన్న ఏకైక బలం ఆర్థిక వనరులు. రాజకీయాల్లో డబ్బు ఉంటే సరిపోదు, దానిని నమ్మివచ్చే నాయకులు, కేడర్ ఉండాలి అనేది ప్రాథమిక సూత్రం. విజయసాయిరెడ్డి వద్ద వనరులకు లోటు లేకపోయినా, కేవలం ఆయన పెట్టే ఖర్చులను చూసి , డిజిటల్ మీడియా ఫండింగ్‌ను ఆశించి వచ్చే అనుచరులు మాత్రమే ఆయన చుట్టూ చేరే అవకాశం ఉంది. ప్రజాదరణ, మాస్ ఇమేజ్ ఉన్న రాజకీయ నేతలెవరూ తమ భవిష్యత్తును ఆయన కొత్త పార్టీకి తాకట్టు పెట్టే సాహసం చేయరు. నియోజకవర్గాల్లో పట్టున్న నాయకులు కాకుండా, కేవలం నిధులు గుంజుకునే అవకాశం కోసమే వచ్చే ద్వితీయ శ్రేణి నేతలు, తాత్కాలిక అవకాశవాదులతో పార్టీ నడపడం ద్వారా ఆయనకు రాజకీయంగా ఒరిగేదేమీ ఉండదు. చివరికి మిగిలేది కేవలం ఖర్చు మాత్రమే.

అసలు కొత్త పార్టీ దేనికి?

ఈ కొత్త ప్రయోగం వెనుక ఆయన అసలు కారణం ఏమిటన్న ప్రశ్న వస్తోంది. వైసీపీని వీడిన నాటి నుంచి జగన్ వైఖరిపై తీవ్ర అసంతృప్తి ఉన్నప్పటికీ, జగన్ పక్కన తనకు దక్కాల్సిన ప్రాధాన్యత , స్థానం మళ్లీ లభిస్తుందనే ఆశ ఆయనలో లోలోపల ఉందనే సంకేతాలు పదే పదే కనిపిస్తున్నాయి. నేరుగా వైఎస్సార్‌సీపీలోకి వెళ్లలేని పరిస్థితి ఉండటంతో, బయట ఒక మూడో ప్రత్యామ్నాయంగా లేదా ఒక రాజకీయ శక్తిగా తన ఉనికిని చాటుకోవడం ద్వారా.. జగన్ తన ప్రాధాన్యతను గుర్తించేలా చేయాలనే ఒక బార్గెనింగ్ స్ట్రాటజీ కూడా ఇందులో దాగి ఉండవచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

ఓ రక్షణ కవచంగా రాజకీయ పార్టీ

మరోవైపు, పాత కేసుల నుంచి రక్షణ, రాజకీయ రంగంలో కొనసాగుతున్నామనే ఒక కవచాన్ని కాపాడుకోవడం లేదా ఇతర కేంద్ర పార్టీల ఒత్తిళ్లకు తలొగ్గడమూ ఈ కొత్త పార్టీ వెనుక కారణాలు కావచ్చు. అయితే, సొంతంగా ప్రజాకర్షణ లేని వ్యూహకర్తలు పార్టీలు పెట్టి జనం ముందుకు వెళ్లినప్పుడు ఎదురయ్యే ఆర్థిక, రాజకీయ పరాభవాలు చరిత్రలో చాలానే ఉన్నాయి. సాయిరెడ్డి వంటి సీనియర్ ఆడిటర్, వ్యూహకర్తకు ఈ విషయం తెలియంది కాదు. అయినప్పటికీ, ఆశయం కంటే ఒత్తిళ్లు, వ్యూహాల కంటే ఖర్చులే ఎక్కువగా ఉన్న ఈ కొత్త రాజకీయ ప్రయాణంలో విజయసాయిరెడ్డికి లభించే రాజకీయ మైలేజ్ అతిస్వల్పమే. పార్టీ నిర్మాణం, డిజిటల్ మీడియా నిర్వహణ పేరిట కోట్లాది రూపాయల ఖర్చు మినహా.. క్షేత్రస్థాయిలో ఓటు బ్యాంకు ఏమీ ఏర్పడదు.

# కమలంలో కనిపించని అగ్రెసివ్ అప్రోచ్




హైదరాబాద్, తెలంగాణ రాజకీయ రంగంలో భారతీయ జనతా పార్టీ ఒక ప్రత్యేకమైన సవాలును, అదే సమయంలో అపారమైన అవకాశాన్ని ఎదుర్కొంటోంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి బలమైన ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు కావాల్సిన సానుకూల పరిస్థితులు ఉన్నప్పటికీ, ఆ అవకాశాలను ప్రత్యక్ష రాజకీయ ప్రయోజనాలుగా మలచుకోవడంలో బీజేపీ పూర్తి స్థాయిలో సఫలీకృతం కాలేకపోతోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీ స్థానాలను గెలుచుకుని, 35 శాతం మేర ఓటు షేర్‌ను సాధించి తన ప్రాభవాన్ని చాటుకున్నప్పటికీ, ఆ ఊపును క్షేత్రస్థాయి స్థానిక సంస్థల ఎన్నికలు మరియు నియోజకవర్గ స్థాయిలో నిలబెట్టుకోవడంలో పార్టీ కొంత తడబడుతోంది.ప్రస్తుతం తెలంగాణ బీజేపీలో వ్యక్తమవుతున్న అతి పెద్ద లోపం బలమైన నిలకడైన నాయకత్వం . ఉత్తర తెలంగాణలో పార్టీకి గట్టి పట్టు ఉన్నప్పటికీ, తెలంగాణ వ్యాప్తంగా ఓటర్లను ఆకర్షించగల, సర్వామోదయోగ్యమైన అగ్రనేత కొరత స్పష్టంగా కనిపిస్తోంది. తరచూ మారుతున్న వ్యూహాలు, నాయకత్వ మార్పులు, అంతర్గత విబేధాలు క్యాడర్‌లో గందరగోళాన్ని నింపుతున్నాయి. ప్రజల సమస్యలపై నిలకడగా పోరాటం చేస్తూ, ప్రతీ నియోజకవర్గంలో పార్టీని నడిపించే ఒక పవర్‌ఫుల్ ఫేస్ లేకపోవడం పార్టీ విస్తరణకు ప్రధాన ప్రతిబంధకంగా మారిందిపాక్షికంగా బిఆర్ఎస్ వైఖరి పట్ల సానుభూతి, మెత్తటి వైఖరి అవలంబిస్తుందనే ప్రచారం కూడా బీజేపీకి రాజకీయంగా నష్టం చేకూరుస్తోంది. గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనపై కోపంతో ఉన్న ఓటర్లు లేదా కాంగ్రెస్ పాలనపై అసంతృప్తి చెందుతున్న ప్రజలు ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపు చూడాలంటే.. బీజేపీ స్పష్టమైన ప్రతిపక్ష పాత్రను పోషించాల్సి ఉంటుంది. బిఆర్ఎస్ గ్రాఫ్ పడిపోతున్న ప్రతిసారీ ఆ పార్టీ స్థానాన్ని ఆక్రమించడంలో వెనకబడితే, ఆ ఓటు బ్యాంక్ మొత్తం తిరిగి కాంగ్రెస్ వైపునకో లేదా స్వతంత్రుల వైపునకో మరలే ప్రమాదం ఉంది.భవిష్యత్తులో బీజేపీ అధికార పీఠానికి చేరువ కావాలంటే, బిఆర్ఎస్ సాంప్రదాయక ఓటు బ్యాంకును కైవసం చేసుకోవడమే ఏకైక మార్గం. ఒకప్పుడు బిఆర్ఎస్‌కు అండగా నిలిచిన గ్రామీణ, వెనుకబడిన వర్గాలు, తటస్థ ఓటర్లను తనవైపు తిప్పుకునేందుకు పక్కా ప్రణాళిక అవసరం. బిఆర్ఎస్ నాయకత్వం రెస్ట్ మోడ్‌లో ఉందనే భావన ప్రజల్లో ఉన్నప్పుడు, ఆ ఖాళీని బీజేపీ తన నిరంతర ప్రజా ఉద్యమాల ద్వారా భర్తీ చేయాలి. కేవలం హిందూత్వ ఎజెండా లేదా పార్లమెంట్ ఎన్నికల నాటి ఇమేజ్‌పైనే ఆధారపడకుండా, స్థానిక సమస్యలపై పోరాటం చేయాల్సి ఉంటుంది. అయితే ఈ మార్గం అనుకున్నంత సులువు కాదు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కాంగ్రెస్ తన సంక్షేమ పథకాలు, క్షేత్రస్థాయి యంత్రాంగంతో బలంగా నిలబడింది. బిఆర్ఎస్ ఓటు బ్యాంకును ఆకర్షించడంలో కాంగ్రెస్ సైతం తన మార్క్ చూపుతోంది. ఈ త్రికోణ పోటీలో బీజేపీ తన ప్రత్యర్థి కేవలం కాంగ్రెస్ మాత్రమే నని చాటిచెబుతూ, బిఆర్ఎస్ మిగిల్చిన రాజకీయ శూన్యాన్ని భర్తీ చేయడానికి సమగ్రమైన సంస్థాగత నిర్మాణం చేపడితే తప్ప అనుకున్న లక్ష్యం సాధ్యం కాదు. రాబోయే రెండేళ్ల సమయం తెలంగాణ బీజేపీకి అత్యంత కీలకమైనది. పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధి దాటి, గల్లీ స్థాయి వరకు కమిటీలను బలోపేతం

# రెండేళ్ల పాలనకు రెఫరెండమేనా



విజయవాడ,ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాలు శరవేగంగా సాగుతుండటంతో, ఈ ఎన్నికల ఫలితాలు కూటమి ప్రభుత్వం సాధించిన రెండేళ్ల పాలనకు రెఫరెండం అవుతాయా అనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. సర్వే ఏజెన్సీలు ఇచ్చే ప్రైవేటు సర్వేలు, ఒపీనియన్ పోల్స్ ఎన్ని వచ్చినా.. గ్రామ , నగర స్థాయిలో ఓటర్లు నేరుగా తమ ఓటు హక్కును వినియోగించుకునే ఈ ఎన్నికలే అసలైన ప్రజాభిప్రాయానికి నిలువెత్తు అద్దమని నమ్మడంలో సందేహం లేదు. అయితే, ఈ ఎన్నికలను బహిరంగంగా రెఫరెండం గా అంగీకరించేందుకు రాజకీయ పార్టీలు, ముఖ్యంగా అధికార పక్షం ముందుకు వస్తుందా లేదా అనేది అసలైన ప్రశ్న.సాధారణంగా ఏ రాష్ట్రంలోనైనా అధికారంలో ఉన్న పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికలను తమ ప్రభుత్వ పాలనపై రెఫరెండం అని అధికారికంగా ప్రకటించడానికి ఇష్టపడవు. స్థానిక ఎన్నికల్లో కేవలం రాష్ట్రస్థాయి విధానాలు లేదా సంక్షేమ పథకాలే కాకుండా, స్థానిక అభ్యర్థి ఇమేజ్, కుల సమీకరణాలు, వ్యక్తిగత సంబంధాలు, ధనప్రవాహం వంటి అనేక హైపర్-లోకల్ అంశాలు ప్రభావం చూపుతాయి. ప్రభుత్వంపై ఎంత పాజిటివ్ వేవ్ ఉన్నప్పటికీ, స్థానికంగా ఎంపీటీసీ, సర్పంచ్ , కార్పొరేటర్ అభ్యర్థులపై ఉండే అసంతృప్తి వల్ల కూడా కొన్ని స్థానాలు చేజారే ప్రమాదం ఉంటుంది. అందుకే, అధికార కూటమి ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేసినప్పటికీ, దీనికి రెఫరెండం ముద్ర వేసి అనవసర రాజకీయ ప్రమాదాన్ని కొనితెచ్చుకోదు.మరోవైపు, ప్రైవేటు సర్వేల ను పక్కన పెడితే.. స్థానిక పోరులో వచ్చే ఫలితాలే అసలైన గ్రౌండ్ రియాలిటీని సూచిస్తాయి. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన సంచలనాత్మక తీర్పు తర్వాత, కూటమి అమలు చేస్తున్న సూపర్ సిక్స్ హామీలు, పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాలు , అమరావతి అభివృద్ధి వంటి పరిణామాలు ప్రజల్లో ఎంతవరకు సానుకూలతను నింపాయో ఈ ఎన్నికల ద్వారా స్పష్టమవుతుంది. గ్రామీణ ,పట్టణ ఓటర్లు కూటమి పాలన పట్ల సంతృప్తిగా ఉన్నారా లేదా అనేది బ్యాలెట్ బాక్సుల ద్వారా నిరూపితమవుతుంది. ఇక ప్రతిపక్ష వైఎస్ఆర్‌సీపీ ఈ రెఫరెండం వాదనను ఒక రాజకీయ ఆయుధంగా మార్చుకోవడానికి ప్రయత్నిస్తోంది. కూటమి ప్రభుత్వ వైఫల్యాలకు, హామీల నెరవేర్పులో జరుగుతున్న జాప్యానికి ఈ ఎన్నికలే కొలమానం అని ప్రచారం చేయడం ద్వారా ఓటర్లను తమవైపు తిప్పుకోవచ్చని భావిస్తోంది. అయితే, జగన్ పార్టీ నిజంగా ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని, అధికార పార్టీకి కౌంటర్ ఇవ్వాలంటే కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, ప్రతీ స్థానంలోనూ గట్టి పోటీని ఇచ్చి ఓటర్లలో నమ్మకాన్ని పునరుద్ధరించాల్సి ఉంటుంది. ఇక అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పరంగా చూస్తే, ఈ ఎన్నికలు కేవలం గెలుపోటములకే పరిమితం కాకుండా, మిత్రపక్షాల మధ్య సమన్వయం ఎంతవరకు బలపడిందో తేల్చే వేదికగా మారనున్నాయి. క్షేత్రస్థాయిలో వార్డులు, పంచాయతీల స్థాయిలో టిక్కెట్ల కేటాయింపులో పార్టీల మధ్య ఘర్షణలు రాకుండా చూసుకోవడం కూటమి పెద్దలకు సవాలుగా మారనుంది.కూటమి నేతలు స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు జరిపి భారీ విజయాన్ని సాధిస్తే, అది వైఎస్ఆర్‌సీపీ నైతిక ధైర్యాన్ని దెబ్బతీయడమే కాకుండా, కూటమి పాలనకు ప్రజల ఆమోదముద్ర పడినట్లే అవుతుంది. సాంకేతికంగా లేదా అధికారికంగా ఏ పార్టీ కూడా ఈ స్థానిక పోరును పాలనా రెఫరెండం అని ఒప్పుకోకపోయినా, రాజకీయ విశ్లేషకుల దృష్టిలో మరియు ప్రజల ఆలోచనల్లో ఇది కచ్చితంగా కూటమి ప్రభుత్వ పనితీరుకు వేసే గ్రేడింగ్ మార్కులే. ఈ ఎన్నికల ఫలితాలు రాబోయే 2029 సార్వత్రిక ఎన్నికలకు స్పష్టమైన పొలిటికల్ రోడ్‌మ్యాప్‌ను, మూడ్‌ను నిర్దేశిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు

# కేసీఆర్ రాజీనామా చుట్టూ రాజకీయాలు



మెదక్,తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాజీనామా డిమాండ్ చుట్టూ భగ్గుమంటున్నాయి. అసెంబ్లీ సమావేశాలకు గైర్హాజరవుతున్న కేసీఆర్.. ఎమ్మెల్యే పదవిలో కొనసాగే నైతిక హక్కును కోల్పోయారని అధికార కాంగ్రెస్ ముప్పేట దాడి చేస్తుంటే, బీఆర్ఎస్ అంతే దీటుగా ప్రతిదాడికి దిగుతోంది. ఒకవైపు శాసనసభ సంప్రదాయాలు, నైతిక బాధ్యతల పేరిట కాంగ్రెస్ ఒత్తిడి పెంచుతుంటే, మరోవైపు దీనిని రాజకీయ ప్రతీకారంగా అభివర్ణిస్తూ బీఆర్ఎస్ సెంటిమెంట్ అస్త్రాన్ని ప్రయోగిస్తోంది. మొత్తంగా కేసీఆర్ హాజరు అంశం రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త రణరంగాన్ని సృష్టించింది.ప్రజాప్రతినిధిగా ఎన్నికైన వ్యక్తి సభకు రాకుండా తప్పించుకోవడం ప్రజాస్వామ్యానికే అవమానమని కాంగ్రెస్ నేతలు వాదిస్తున్నారు. ప్రజల సమస్యలను చట్టసభలో లేవనెత్తాల్సిన బాధ్యతను విస్మరిస్తూ, ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్‌కు ఎమ్మెల్యేగా కొనసాగే అర్హత లేదని అధికార పక్షం తేల్చి చెబుతోంది. అసెంబ్లీ గేటు తొక్కకుండా ప్రజాధనంతో వచ్చే జీతభత్యాలు, సదుపాయాలు అనుభవించడం సిగ్గుచేటని మంత్రులు నేరుగా విమర్శలు గుప్పిస్తున్నారు. పదేళ్లపాటు సీఎంగా పనిచేసిన వ్యక్తికి అసెంబ్లీలో కూర్చోవడానికి అహం అడ్డొస్తోందా అని కాంగ్రెస్ నిలదీస్తోంది. ప్రతిపక్ష నేత హోదా దక్కించుకుని కూడా సభలో ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో విఫలమయ్యారని, ప్రజా సమస్యలపై మాట్లాడే దమ్ము లేకపోతే వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తోంది.కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా ఖండిస్తున్నాయి. కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడం వెనుక ఉన్న కారణాలను రాజకీయంగా, భావోద్వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నాయి. సీఎం స్థాయి వ్యక్తి కేసీఆర్ చావును కోరుకుంటున్నారని, ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కి మాట్లాడే వ్యక్తులు ఉన్న సభలోకి వెళ్లి మాటలు పడాల్సిన అవసరం కేసీఆర్‌కు లేదని గులాబీ నేతలు స్పష్టం చేస్తున్నారు. సభలో చర్చల కంటే వ్యక్తిగత దూషణలు, కక్షసాధింపులే లక్ష్యంగా మారినప్పుడు అక్కడకు వెళ్లడం ఆత్మగౌరవానికి భంగకరమని వాదిస్తున్నారు. కేసీఆర్ మళ్లీ సీఎంగానే అసెంబ్లీలో అడుగుపెడతారని బీఆర్ఎస్ నేతలు ఘంటాపథంగా చెబుతున్నారు. గతంలో తమిళనాడు రాజకీయాల్లో ఎంజీఆర్, కరుణానిధి, జయలలిత వంటి దిగ్గజాలు, ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు కూడా అధికార పక్షం వైఖరిని నిరసిస్తూ సభను బహిష్కరించిన సందర్భాలను బీఆర్ఎస్ గుర్తుచేస్తోంది. అప్పుడు ప్రజాక్షేత్రంలో తేల్చుకుని తిరిగి అధికారంలోకి వచ్చినట్లే, కేసీఆర్ కూడా ప్రజల వద్దకే వెళ్తారని స్పష్టం చేస్తోంది.ఈ వివాదం వెనుక ఉభయపక్షాల వ్యూహాత్మక రాజకీయాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కేసీఆర్‌ను సభకు రప్పించడం ద్వారా ఆయన వైఫల్యాలను, గత పదేళ్ల పాలనను నేరుగా ఎండగట్టవచ్చని కాంగ్రెస్ భావిస్తోంది. ఒకవేళ ఆయన రాకపోతే పారిపోయారన్న ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి బీఆర్ఎస్‌ను నైతికంగా బలహీనపరచాలని అధికార పార్టీ చూస్తోంది. గజ్వేల్‌లో ఉపఎన్నిక వస్తే కేసీఆర్‌ను రాజకీయంగా మరింత దెబ్బతీయవచ్చనే ఆలోచన కూడా కాంగ్రెస్ వ్యూహాల్లో భాగంగా కనిపిస్తోంది.మరోవైపు బీఆర్ఎస్, కేసీఆర్ భద్రత, కాంగ్రెస్ నేతల అనుచిత వ్యాఖ్యలను ప్రజల్లో ప్రధాన చర్చనీయాంశంగా మార్చాలని యోచిస్తోంది. సభకు వెళ్లకపోవడాన్ని ప్రజా ఆత్మగౌరవ పోరాటంగా చిత్రీకరిస్తూ తెలంగాణ సెంటిమెంట్‌ను మళ్లీ రగిల్చే ప్రయత్నం చేస్తోంది. కాంగ్రెస్ రాజీనామా డిమాండ్ ద్వారా తమ అధినేతను వేధిస్తోందన్న భావనను కేడర్‌లోకి బలంగా తీసుకెళ్లి, సానుభూతి కూడగట్టడమే లక్ష్యంగా గులాబీ దళం పావులు కదుపుతోంది.మొత్తంగా కేసీఆర్ అసెంబ్లీ హాజరు, రాజీనామా వ్యవహారం కేవలం ఒక నియమ నిబంధనల అంశం మాత్రమే కాదు. ఇది రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో పైచేయి సాధించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య జరుగుతున్న హైవోల్టేజ్ మైండ్ గేమ్‌గా మారింది.

# మెట్రోలకు కొత్త సిగ్నలింగ్... కొత్త కోచ్ లు



హైదరాబాద్, హైదరాబాద్ మెట్రో రైలు వ్యవస్థలో కొత్త కోచ్‌లను ప్రవేశపెట్టే ప్రక్రియలో కీలక సాంకేతిక అంశం తెరపైకి వచ్చింది. ప్రస్తుతం ఉన్న పాత రోలింగ్ స్టాక్‌తో కొత్త కోచ్‌లను అనుసంధానం చేయాలంటే.. కొత్త కోచ్‌లను పాత సిగ్నలింగ్ వ్యవస్థకు అనుగుణంగా తయారు చేయాలా? లేక ఇప్పటికే ఉన్న సిగ్నలింగ్, ట్రైన్ కంట్రోల్ వ్యవస్థనే ఆధునికీకరించాలా? అనే అంశంపై చర్చ జరుగుతోంది. రెండో మార్గమే మెరుగైనదని దిల్లీ మెట్రో రైలు కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ) సూచించినట్లు సమాచారం.ఇటీవల హైదరాబాద్‌కు వచ్చిన డీఎంఆర్‌సీ ఇంజినీర్లు కొత్త మెట్రో కోచ్‌ల కొనుగోలు అంశంపై హైదరాబాద్ మెట్రో రైలు అధికారులతో ప్రాథమికంగా చర్చించారు. పాత సాంకేతికతకు అనుగుణంగా కొత్త రైళ్లను ప్రత్యేకంగా రూపొందించడం కంటే.. మొత్తం సిగ్నలింగ్, ట్రైన్ కంట్రోల్ వ్యవస్థను ఆధునికీకరిస్తే భవిష్యత్తులో కొత్త కోచ్‌లను సమీకరించడం సులభమవుతుందని సూచించినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ మెట్రోలో ప్రస్తుతం 57 ట్రైన్ సెట్లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో రైలులో మూడు కోచ్‌లు ఉంటాయి. ఉదయం, సాయంత్రం కార్యాలయాల రద్దీ వేళల్లో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరుగుతుండటంతో ప్రస్తుతం ఉన్న రైళ్లు సరిపోవడం లేదని అధికారులు గుర్తించారు. రద్దీని తగ్గించడంతోపాటు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం అదనపు రైళ్ల కొనుగోలుకు నిర్ణయం తీసుకుంది.ఇందులో భాగంగా 60 కొత్త కోచ్‌లు, అంటే 10 కొత్త మూడు కోచ్‌ల ట్రైన్ సెట్లను కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. వీటి సమీకరణకు సంబంధించిన ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. అయితే కొత్త కోచ్‌లను ప్రస్తుత వ్యవస్థతో అనుసంధానం చేసే విషయంలోనే సాంకేతిక సవాలు ఎదురవుతోంది. హైదరాబాద్ మెట్రో మొదటి దశలో కొనుగోలు చేసిన రోలింగ్ స్టాక్ ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్, ఆటోమేటిక్ ట్రైన్ ఆపరేషన్, కమ్యూనికేషన్ బేస్డ్ ట్రైన్ కంట్రోల్ వంటి సాంకేతిక వ్యవస్థలకు అనుగుణంగా రూపొందించారు. ఈ వ్యవస్థలు రైళ్ల వేగ నియంత్రణ, భద్రత, రైళ్ల మధ్య దూరం, ఆటోమేటిక్ ఆపరేషన్ వంటి అంశాల్లో కీలక పాత్ర పోషిస్తాయి.ప్రస్తుతం కొత్తగా కొనుగోలు చేసే కోచ్‌లు కూడా ఇదే సిగ్నలింగ్, కంట్రోల్ వ్యవస్థకు అనుగుణంగా పనిచేయాల్సి ఉంటుంది. అయితే దాదాపు 12 ఏళ్ల క్రితం అందుబాటులో ఉన్న సాంకేతికతతో పోలిస్తే ఇప్పుడు సిగ్నలింగ్ రంగంలో గణనీయమైన మార్పులు వచ్చాయని డీఎంఆర్‌సీ అభిప్రాయపడుతోంది. పాత వ్యవస్థకు సరిపోయేలా కొత్త కోచ్‌లను రూపొందించడం వల్ల భవిష్యత్తులో సాంకేతిక పరిమితులు ఏర్పడే అవకాశం ఉందని భావిస్తోంది. హైదరాబాద్ మెట్రో మొదటి దశలో ఏర్పాటు చేసిన పాత సిగ్నలింగ్ వ్యవస్థను ప్రస్తుత ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా అప్‌గ్రేడ్ చేయాలని డీఎంఆర్‌సీ సూచించినట్లు సమాచారం. సిగ్నలింగ్ వ్యవస్థ ఆధునికీకరణతోపాటు ప్రస్తుతం ఉన్న పాత రోలింగ్ స్టాక్‌లో అవసరమైన మార్పులు చేస్తే.. కొత్త కోచ్‌లను కూడా ఆధునిక సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది.ఈ విధానం వల్ల ప్రస్తుతం ఉన్న రైళ్లు, భవిష్యత్తులో కొనుగోలు చేసే కొత్త రైళ్ల మధ్య సాంకేతిక అనుసంధానం మెరుగుపడటమే కాకుండా మెట్రో వ్యవస్థను దీర్ఘకాలిక అవసరాలకు సిద్ధం చేయవచ్చని భావిస్తున్నారు. అంతేకాకుండా భవిష్యత్తులో మరిన్ని రైళ్లను కొనుగోలు చేసే సమయంలోనూ ఇదే ఆధునిక సిగ్నలింగ్ ప్రమాణాలను కొనసాగించే అవకాశం ఉంటుంది. కొత్త కోచ్‌లు అందుబాటులోకి వస్తే రద్దీ సమయాల్లో అదనపు ట్రైన్ సెట్లను నడిపేందుకు అవకాశం ఏర్పడుతుంది. అయితే కోచ్‌ల కొనుగోలుతో పాటు సిగ్నలింగ్ వ్యవస్థ సామర్థ్యాన్ని కూడా పెంచాల్సిన అవసరం ఉంటుంది. ప్రస్తుతం ఉన్న మౌలిక వసతులను ఆధునీకీకరించడం ద్వారా రైళ్ల నిర్వహణ, భద్రత, సమయపాలన వంటి అంశాలను మరింత మెరుగుపరచవచ్చని అధికారులు భావిస్తున్నారు.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140